www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
11-08-2024
సంపుటి : 01 । సంచిక : 99 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD

## కలిసి పనిచేద్దాం

**తెలంగాణకు స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ సహకారం**

ప్రతినిధులతో రేవంత్ రెడ్డి బృందం సమావేశం

బయోడిజైన్ రంగంలో నైపుణ్యాల అభివృద్ధే లక్ష్యం

ప్రభుత్వంతో భాగస్వామ్యం.. శాటిలైట్ సెంటర్ పై ఆసక్తి

తెలంగాణ యువత భవితకు కొత్త బాటలు పడతాయన్న సీఎం

గూగుల్ ప్రధాన కార్యాలయానికి సందర్శించిన బృందం...




**విశ్వంభర, తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు కాలిఫోర్నియాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ముందుకు వచ్చింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించింది. స్టాన్ పోర్డ్ బైర్స్ సెంటర్ ఫర్ బయోడిజైన్ విభాగంలోని సీనియర్ ప్రతినిధులతో సమావేశమైంది. మిగతా2లో...

## నాకు నమ్మకముంది

- కేటీఆర్ ను రేవంత్ రెడ్డి జైల్లో వేస్తారు
- కేటీఆర్ చేసిన అరాచకాలు, అవినీతి అందరికీ తెలుసు.
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటైనా బీజేపీ ధాటికి తట్టుకోలేనంతగా యుద్ధం చేస్తాం..
- బీఆర్ఎస్ తో బీజేపీ చర్చలు ఫేక్ న్యూస్
- మీడియాతో చిట్ చాట్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్


2



# కేరళకు అండగా ఉంటాం

**ఈ విపత్తు సాధారణమైనది కాదు**

నిధుల కొరత లేకుండా చూస్తాం

వయనాడ్‌లో పర్యటించిన ప్రధాని

బాధితులను పరామర్శించిన మోదీ

ప్రకృతి ప్రకోపానికి తుడిచిపెట్టుకుపోయిన కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం పర్యటించారు. కొండచరియలు విరిగిపడి తీవ్రంగా దెబ్బతిన్న ముండక్కై, చురాల్మల తదితర ప్రాంతాల్లో ప్రధాని విహంగ వీక్షణం చేశారు. పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారితోపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అక్కడ సాగుతున్న సహాయక చర్యలు, బాధితుల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేరళకు కేంద్రప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు.అక్కడి పరిస్థితి మెరుగు పడేందుకు మా సర్కార్ కృషి చేస్తుంది" అని మోదీ పేర్కొన్నారు.

**వయనాడ్:** ప్రకృతి ప్రకోపంతో కేరళలోని వయనాడ్ జిల్లా ఇటీవల అతలాకుతలమైన సంగతి తెలిసిందే. కొండచరియలు విరిగిపడి పలు గ్రామాలు నామ రూపాల్లేకుండా శిథిలమయ్యాయి. వయనాడ్లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 300 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.ప్రకృతి విలయంతో తల్లడిల్లిన అల్లకల్లోలంగా మారిన వయనాడ్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు.

**విలయం తీవ్రత తెలుసుకున్న ప్రధాని..**

శనివారం 11 గంటలకు మోదీ కన్నూర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం వీరంతా వాయుసేన మిగతా2లో...

## పనితనంలో వ్యత్యాసం

- న్యాయమూర్తుల, న్యాయవాదుల పనితీరుపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు


2

చాన్నాళ్లయింది.. అందరినీ

## చూసేందుకు వచ్చా

- త్వరలో తెలంగాణ టీడీపీకి అధ్యక్షున్ని నియమిస్తా
- 40 ఏళ్లలో అన్నింటిని తట్టుకొని నిలబడ్డాం
- ఎన్టీఆర్ భవన్లో తెలంగాణ ముఖ్యనేతల సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు


2



కేంద్ర క్యాబినెట్ సెక్రటరీగా

## సోమనాథన్

- 1987 బ్యాచ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి
- కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం

9

## ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు!

**ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**

సుంకిశాల ప్రమాదాన్ని చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారు

రాహుల్ గాంధీకి కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నలు



**విశ్వంభర, హైదరాబాద్:**

గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్‌కు దగ్గరలో నిర్మిస్తున్న సుంకిశాల. సాగర్ నుంచి సర్జ్‌పూల్‌లోకి నీటిని నింపేందుకు ఏర్పాటు చేసిన మూడు టన్నెళ్లలో ఓ టన్నెల్ గేటు ఎట్టుకుపోగా.. 170 అడుగుల ఎత్తులో నిర్మించిన రిటైనింగ్ వాల్ కూలిపోయింది. అయితే, ఈ నెల 2న ఘటన జరగ్గా.. కావాలనే ప్రభుత్వం దాచిపెట్టిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ మిగతా2లో...



## అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు

**నిశితంగా చర్చించిన మంత్రివర్గ ఉపసంఘం**

- సక్సేనా కమిటీ సిఫారసుల పరిశీలన
- విధివిధానాల రూపకల్పనలో రాజకీయాలకతీతంగా భాగస్వామ్యం

- గ్రామీణ ప్రాంతాలలో లక్షన్నర, పట్టణాల్లో రూ.2లక్షల ఆదాయం మించరాదు
- మాగాణి మూడున్నర ఎకరాలు, చెల్క ఏడున్నర ఎకరాలు
- పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.రెండు లక్షలకు మించి ఉండరాదు
- ఛైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం
- హాజరైన ఉప సంఘం సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనరసింహ

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డుల మంజూరీ ఉంటుందని మంత్రివర్గ ఉప సంఘం స్పష్టం చేసింది.అయితే అందుకు విధి విధానాలను పరిశీలిస్తున్నట్లు మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు నిర్ణయించారు.శనివారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో కొత్త తెల్ల రేషన్ కార్డుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేసిన మంత్రివర్గ ఉప సంఘము సమావేశమై తెల్ల రేషన్ కార్డు మంజూరీ పై నిశితంగా చర్చించారు. మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

**ఎస్సీ వర్గీకరణ అమలుకు**

## రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలి

రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రధాని మోదీ నిర్దిష్టంగా హామీ ఇచ్చారు

దిల్లీలో మీడియాతో మందకృష్ణ మాదిగ



**దిల్లీ:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రధాని మోదీ నిర్దిష్టంగా హామీ ఇచ్చారని చెప్పారు. ఢిల్లీలో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. మిగతా2లో...


2

**భారత్-మాల్దీవుల సంబంధాలు**

## మరింత బలోపేతం

మాల్దీవుల పర్యటనలో జైశంకర్.. అధ్యక్షుడు ముయిజ్జుతో భేటీ

కీలక అంశాలపై ఇద్దరు నేతలు చర్చ

## 'సుంకిశాల'పై సమగ్ర దర్యాప్తు జరపాలి

జాగ్రత్తలు తీసుకొంటే ప్రమాదం జరిగేది కాదు..

ఇప్పటికైనా పర్యవేక్షణ పెట్టాలి

కూలిన ప్రాంతాన్ని పరిశీలించిన సీపీఎం ప్రతినిధి బృందం


2

## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 80 | రిటైల్ ₹ 102 |
| స్కిన్ ₹ 148 | స్కిన్ లెస్ ₹ 168 |

# చాన్నాళ్లయింది.. అందరినీ చూసేందుకు వచ్చా..

**విశ్వంభర, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్లో జరిగిన ఐదేళ్ల విధ్వంసాన్ని సరి చేయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ భవన్లో జరిగిన తెలంగాణ ముఖ్యనేతల సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, సభ్యత్వాల నమోదుపై చర్చించారు. నాలుగు దశాబ్దాల్లో పార్టీ ఎత్తుపల్లాలు, విజయాలను ప్రస్తావించిన ఆయన అన్నింటినీ తట్టుకొని నిలబడ్డామని గుర్తు చేశారు."చాన్నాళ్లయింది.. అందరినీ చూసేందుకు వచ్చా. పార్టీ కోసం కష్టపడ్డ వారికి నేను రావడం ఉత్సాహాన్నిస్తుంది. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని అభిమానులు, కార్యకర్తలు కోరుతున్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో గత ఎన్నికల్లో పోటీ చేయలేదు, అధ్యక్షుడిని నియమించలేదు. ఇక్కడి ప్రజల మనోభావాలను గౌరవిస్తా పార్టీని ఎలా బలోపేతం చేయాలి, కార్యకర్తలకు ఎలా అందుబాటులో ఉంచాలో ఆలోచిస్తా. త్వరలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని నియమిస్తా. ఒకప్పుడు తెలంగాణాలో తెలుగుదేశం బలమైన పార్టీ.. కొన్ని కారణాల వల్ల బలహీనమయ్యాం. సామరస్యంగా మంచి వాతావరణంలో రెండు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా" అని చంద్రబాబు వివరించారు.

# కేరళకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)
హెలికాప్టర్లో వయనాడ్కు బయల్దేరారు. ఆ మార్గంలోనే కొండచరియలు విరిగిపడి తీవ్రంగా దెబ్బతిన్న ముండక్కై, చురాల్మల తదితర ప్రాంతాల్లో ప్రధాని విహంగ వీక్షణం చేశారు. ప్రధాని వెంట కేంద్రమంత్రి సురేశ్ గోపి కూడా ఉన్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించిన ఆయన.. అక్కడి పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారితోపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఏరియల్ సర్వే నిర్వహించి విలయం తీవ్రతను తెలుసుకున్నారు.

**కేరళకు అండగా ఉంటాం..**

వయనాడ్లో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేరళకు కేంద్రప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు.వయనాడ్లో పర్యటించిన అనంతరం అక్కడి పరిస్థితిపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ప్రధాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేరళకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. "కొండచరియలు విరిగిపడిన అదే రోజు సీఎం పినరయి విజయన్ తో మాట్లాడాను. ప్రకృతి విలయంలో ఎందరో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విపత్తు సాధారణమైనది కాదు. వేలాది కుటుంబాల కలలు కల్లలుగా మారాయి. అక్కడి పరిస్థితిని చూశాను. బాధితులను కలిశా. మృతుల కుటుంబాలకు కేంద్రం అండగా ఉంది. అక్కడి పరిస్థితి మెరుగు పడేందుకు మా సర్కార్ కృషి చేస్తుంది" అని మోదీ పేర్కొన్నారు.


# పనితనంలో వ్యత్యాసం

**దిల్లీ:** కోర్టుల్లో న్యాయమూర్తులు, న్యాయవాదుల పనితీరుపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'న్యాయమూర్తికి.. న్యాయవాదికి మధ్య వ్యత్యాసం ఉంటుంది. న్యాయమూర్తి ఎప్పుడూ తన 'పాదముద్రలను' ఇసుకపై వదిలివేస్తాడు. ఈ పాదముద్రలు న్యాయమూర్తితో రూపొందించబడ్డ రాతపూర్వక పదాలు. న్యాయవాది వాదనలు ఎంత ఎంత ఆకట్టుకునేలా ఉన్నా.. ఆ వాదనలు భవిష్యత్తు తరాలకు దూరమవుతాయి' అంటూ జస్టిస్ ఏపీ సేన్ చేసిన వ్యాఖ్యలను సీజేఐ గుర్తు చేశారు. దేశంలోని కోర్టుల్లో సాంకేతిక, ల్యాండ్స్కేప్పై జరిగిన జాతీయ కాన్ఫరెన్స్లో సీఐజే పాల్గొని మాట్లాడారు. '1998లో బాంబే హైకోర్టులో న్యాయమూర్తి పదవికి నన్ను ఆహ్వానించారు. దాన్ని అంగీకరించాలా? వద్దా? అనే విషయాన్ని నిర్ణయించుకోలేకపోయాను. ఈ విషయంలో చాలామంది విద్యావంతులను సంప్రదించాను. నేను సంప్రదించిన వారిలో జస్టిస్ ఏపీ సేన్ ఒకరు. ఏపీ సేన్ ఏడీఎం జబల్పూర్ కేసులో తీర్పు ఇచ్చారు. నాగ్పూర్లోని తన నివాసానికి నన్ను ఆహ్వానించారు. ఆ సమయంలో న్యాయమూర్తి పనితనానికి, న్యాయవాదికి మధ్య వ్యత్యాసం ఉంటుంది అని ఆయన నాతో అన్నారు' అని సీజేఐ గుర్తు చేసుకున్నారు. సీజేఐ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల సీజేఐ మహారాష్ట్రకు చెందిన ఓ కేసులో న్యాయవాదిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. శివసేన, ఎన్సీపీ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలంటూ దాఖలైన కేసులను త్వరగా విచారించాలంటూ న్యాయవాది పదేపదే సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని విచారణ ఆలస్యమవుతుందని.. ముందుగాలే విచారించాలని.. విచారణ తేదీలను ప్రకటించాలని కోరగా.. సీజేఐ న్యాయవాదిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టుకు ఆదేశాలు జారీ చేయొద్దని.. న్యాయవాదులు తమ స్థానంలో కూర్చుంటే తమ ఒత్తిడి తెలుస్తుందంటూ ఘాటుగా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

# ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు?

(మొదటి పేజీ తరువాయి)
కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, ప్రభుత్వం మాత్రం రిటైనింగ్ వాల్ కూలడం పెద్ద విషయం కాదని.. నిర్మాణ సంస్థే మళ్లీ నిర్మిస్తుందంటూ చిన్న విషయంగా చూపే ప్రయత్నం చేస్తున్నది. అయితే, సుంకిశాల ప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభలో విపక్షనేత రాహుల్గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు ? సుంకిశాల ప్రమాదానికి ఎవరు బాధ్యులు? అంటూ ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదాన్ని చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారు ? సుంకిశాల ప్రమాదంపై ప్రభుత్వం నుంచి ఎవరూ మాట్లాడడం లేదంటూ నిలదీశారు. నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని ఎవరు ఆపుతున్నారని ప్రశ్నించిన ఆయన.. సుంకిశాల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలి

(మొదటి పేజీ తరువాయి)

"ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాకారంలో మోదీ, అమిత్ పాత్ర ఎంతో ఉంది. ప్రధాని, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలి. వర్గీకరణ డిమాండ్ ఉన్న ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలి. వెంటనే అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించాలని మోదీకి విజ్ఞప్తి చేశా. సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ప్రతి జడ్జికీ పేరుపేరునా ధన్యవాదాలు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్ల ఫలాలు చాలా కుటుంబాలకు అందలేదు. వర్గీకరణకు మద్దతుగా నిలిచిన ప్రతి నాయకుడికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఎస్సీ వర్గీకరణను దక్షిణాదిలో నలుగురు సీఎంలు వెంటనే స్వాగతించారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్వాగతిస్తున్నట్లు చెప్పారు" అని మందకృష్ణ మాదిగ అన్నారు.

# అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి యన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపసంఘము సభ్యులు రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి దామోదరరాజ నరసింహా,రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పౌర సరఫరాల కార్యదర్శి డి.యస్ చౌహాన్, ఆరోగ్య శాఖా కార్యదర్శి చిరిస్తినాజ్ చొంగతి తదితరులు పాల్గొన్నారు.

**గ్రామీణ ప్రాంతాలలో లక్షన్నర,పట్టణాల్లో రూ.2లక్షల ఆదాయం మించరాదు..**

తెల్ల రేషన్ కార్డుకు గ్రామీణ ప్రాంతాలలో వార్షిక ఆదాయం లక్షన్నర కు లోపు ఆదాయం,మాగాణి 3.50 ఎకరాలు,చెలక 7.5 ఎకరాలు అదే పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రెండు లక్షలు మించకుండా ఉండాలన్న ప్రతిపాదన ఉపసంఘము ముందుకు వచ్చిందన్నారు. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారెవరూ ఈ అవకాశం కోల్పోకోకుండా



ఉండేలా లోతైన అధ్యయనం జరుపుతున్నామన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా అధికార,ప్రతిపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులందరి నుండి కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీలో వారి సలహాలు,సూచనలు తీసుకోనున్నట్లు ఉపసంఘము చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.తక్షణమే రాజ్యసభ, లోకసభ,శాసనసభ, శాసనమండలి సభ్యులందరికీ లేఖలు రాసి విధి విధినాలలో వారి నుండి సూచనలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ కార్యదర్శి డి.యస్ చౌహాన్ కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. అంతే కాకుండా డా.ఎన్.సి.సక్షేనా కమిషనర్ గా ఉన్న సక్సేనా కమిటీ సిఫారసులను కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీలో పరిగణనలోకి తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు స్పెషల్ కమిషనర్ హర్ష మందర్ సభ్యుడిగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు దిగువ పేద మధ్యతరగతి ప్రజలకు మంజూరు చేసునున్న తెల్ల రేషన్ కార్డుల మంజూరీ విషయంలో అధికారుల బృందం ఇప్పటికే దేశంలోని మిగితా రాష్ట్రాలలో తెల్ల రేషన్ కార్డుల మంజూరీలో అవలంబిస్తున్న విధి విధానాలను అధ్యయనం చేసినట్లు ఆయన వెల్లడించారు. అయితే అదే సమయంలో అంతర్ రాష్ట్రాల నుండి తెలంగాణా కు వలస వచ్చిన వారికి అక్కడ ఇక్కడ రెండు చోట్లా తెల్లకార్డులు ఉన్నట్లు తేలిందని అటువంటి వారికి అక్కడో... ఇక్కడో అన్న అప్షన్ ఇవ్వాలనే ప్రతిపాదనపై ఉప సంఘము చర్చించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు.కాగా రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చిందే తడవుగా కొత్త తెల్ల రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇవ్వడంతో పది లక్షల దరఖాస్తులు వచ్చాయా న్నారు. అంతే గాకుండా ఇప్పటికే ఉన్న తెల్ల రేషన్ కార్డులలో అదనపు సభ్యులను చేర్చాలి అంటూ వచ్చిన దరఖాస్తు లు 11 లక్షల 33 వేల 881 దరఖాస్తులు వచ్చాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మొత్తం మంజూరికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టబోతున్న ఖర్చు 956.04 కోట్లు అవుతుందన్నారు.

# ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంపన్నశ్రేణిని వర్తింపజేయం

- సుప్రీంకోర్టు సూచనను పరిగణనలోకి తీసుకోం
- అంబేద్కర్ రాజ్యాంగ విధానం ప్రకారమే కోటా
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

**దిల్లీ:** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంపన్న శ్రేణిని (క్రీమీలేయర్) వర్తింపజేయకూడదని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఈ అంశంలో సుప్రీంకోర్టు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోకూడదని నిశ్చయించింది. శుక్రవారం రాత్రి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసారశాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 'రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఈ నెల 1న ఒక తీర్పు ఇచ్చింది. అందులో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై కొన్ని సూచనలు చేసింది. దీనిపై - మంత్రివర్గ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. చివరకు బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో స్పష్టం చేసిన విధానానికి సంపూర్ణంగా కట్టుబడి ఉండాలని క్యాబినెట్ తీర్మానించింది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీలకు సంపన్న శ్రేణి నిబంధన లేదు. ఆ ప్రకారమే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కొనసాగాలని క్యాబినెట్ నిర్ణయించింది' అని వివరించారు.

**3 కోట్ల కొత్త ఇళ్ల నిర్మాణం**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ ప్రాంతాల్లో 2 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో కోటి ఇళ్ల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. పట్టణాల్లో ఈడబ్ల్యూఎస్ ఇళ్లు పొందడానికి రూ.3 లక్షల వరకు, ఎల్ఐజీ ఇళ్లు పొందడానికి రూ.3 లక్షల నుంచి రూ.6లక్షల వరకు, ఎంఐజీ ఇళ్లు పొందడానికి రూ.9 లక్షల వరకు వార్షికాదాయం ఉన్నవారు అర్హులు. ఈ ఇళ్ల నిర్మాణం కోసం తీసుకునే రుణాల్లో తొలి రూ.8 లక్షలపై 12 ఏళ్లకాలానికి 4% వడ్డీ రాయితీ ఇస్తారు. గరిష్ఠంగా ఒక్కో లబ్దిదారుకు రూ.1.80 లక్షల సబ్సిడీ అందిస్తారు. పట్టణాల్లో నిర్మించే ఇళ్ల ఒక్కో యూనిట్కు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష సమకూరుస్తాయి. కేంద్రం రైతులకు నాణ్యమైన ఉద్యానవన మొక్కలను అందించేందుకు రూ.1,765.57 కోట్లతో క్లీన్ప్లాంట్ ప్రోగ్రాం అమలు చేయాలని నిర్ణయించింది. 2023 బడ్జెట్లో చేసిన ప్రకటనను అనుసరించి ఈ పథకాన్ని అమల్లోకి తెస్తోంది. దీనిద్వారా నర్సరీలకు అవసరమైన చేయూతనందించి నాణ్యమైన మొక్కలు తయారు చేసేలా చేస్తారు. దీనివల్ల వినియోగదారులకు వైరస్ లేని మంచి మొక్కలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా ఉత్పత్తి పెరుగుతుంది.

# కలిసి పనిచేద్దాం

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా హెల్త్ కేర్లో కొత్త ఆవిష్కరణలు, విద్య, నైపుణ్య అభివృద్ధి అంశాలపైనే ప్రధానంగా చర్చలు జరిగాయి.

**ఉమ్మడి పరిశోధనలు నిర్వహించాలి...**

తెలంగాణలో ఏర్పాటు చేసే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, న్యూ లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీలో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రభుత్వం వారిని ఆహ్వానించింది. పరస్పరం అధునాతన పరిజ్ఞానాన్ని పంచుకునే కార్యక్రమాలతో పాటు ఉమ్మడిగా పరిశోధనలు నిర్వహించాలనే అభిప్రాయాలు ఈ సమావేశంలో వ్యక్తమయ్యాయి. తెలంగాణలో స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ శాటి లైట్ సెంటర్ను ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలపై చర్చలు జరిగాయి. స్టాన్ఫోర్డ్ అధ్వర్యంలో జరిగే బయోడిజైన్ ఆవిష్కరణలను రాష్ట్రంలో అకడమిక్, హెల్త్ కేర్ విభాగాలకు అనుసంధానం చేయాలని తన ఆలోచనలను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వారితో పంచుకున్నారు. ఈ సమావేశం అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి తగిన సహకారం అందిస్తామని యూనివర్సిటీలోని బయోడిజైన్ విభాగం అధిపతులు డాక్టర్ అనురాగ్ మైరాల్, డాక్టర్ జోష్ మాకోవర్ ప్రకటించారు. తమ ఆసక్తిని వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖను అందించారు. భారీ వైద్య పరికరాల పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని, దీంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రస్తావించారు. వైద్య పరికరాల విద్య, కొత్త ఆవిష్కరణలకు తమ మద్దతు ఉంటుందని ఆ లేఖలో స్పష్టం చేశారు.

**తెలంగాణ యువత భవితకు కొత్త బాటలు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... స్టాన్ ఫోర్డ్ లాంటి ప్రఖ్యాత యూనివర్సిటీతో భాగస్వామ్యం పంచుకోవటం తెలంగాణ యువత భవితకు కొత్త బాటలు వేస్తుందన్నారు. హెల్త్ కేర్ రంగంలో యువతకు నైపుణ్యాల అభివృద్ధిని అందించేందుకు స్టాన్ఫోర్డ్ భాగస్వామ్యం కోరినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలో పరిశ్రమలు, కొత్త ఆవిష్కరణల్లో తెలంగాణ ముందంజలో ఉందని చెప్పారు. స్టాన్ఫోర్డ్ బయోడిజైన్ లాంటి ప్రపంచ స్థాయి విభాగాలు కలిసి వస్తే స్కిల్స్ డెవెలప్మెంట్ లో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడ్డారు. ఈ భాగస్వామ్యం ఒక్క తెలంగాణ వృద్ధికే కాకుండా.. యావత్ ప్రపంచానికి హెల్త్ కేర్ రంగంలో కీలకంగా నిలుస్తుందని అన్నారు. స్టాన్ ఫోర్డ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏర్పాటయ్యే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, లైఫ్ సైన్సెస్ యూనివర్శిటీల లక్ష్యం నెరవేరుతుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణలో లైఫ్ సైన్సెస్, హెల్త్కేర్ పరిశ్రమల వృద్ధికి మరో ముందడుగు పడుతుందన్నారు.

**గూగుల్ ప్రధాన కార్యాలయానికి రేవంత్ రెడ్డి బృందం...**

కాలిఫోర్నియాలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనలో సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ను ఎలా వినియోగించుకోవచ్చుననే అనే అంశాలపై గూగుల్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. ప్రముఖ అంతర్జాతీయ జంతు ఆరోగ్య సంస్థ జోయిటిస్ కంపెనీ ప్రతినిధులు కీత్ సర్బాగ్, అనిల్ రాఘవ్ తదితరులతో సీఎం రేవంత్ రెడ్డి బృందం చర్చించింది.

## భారత్ - మాల్దీవుల సంబంధాలు
# మరింత బలోపేతం

**దిల్లీ:** కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ మాల్దీవుల పర్యటనకు వెళ్లారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం ఆ దేశంలో ల్యాండ్ అయ్యారు. తన పర్యటనలో రెండో రోజైన శనివారం ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య సత్సంబంధాలపై ఇరువురూ చర్చించుకున్నట్లు తెలిసింది. కాగా, చివరి సారిగా 2023 జనవరిలో జైశంకర్ మాల్దీవుల్లో పర్యటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ముయిజ్జు ఈ ఏడాది జూన్లో భారత పర్యటనకు వచ్చిన సమయంలో ఇద్దరూ భేటీ అయ్యారు.తాజా పర్యటనలో పలు కీలక అంశాలపై ఇద్దరు నేతలూ చర్చించినట్లు తెలిసింది. మరోవైపు ఈ భేటీకి సంబంధించిన ఫొటోను జై శంకర్ ఎక్స్లో పోస్టు చేశారు. ముయిజ్జుని కలవడం విశేషమన్నారు. మోదీ తరఫున శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. తమ ప్రజలు, ఈ ప్రాంత ప్రయోజనాల కోసం భారత్ – మాల్దీవుల సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలూ కట్టుబడి ఉన్నాయని తెలిపారు.

## 'సుంకిశాల'పై సమగ్ర దర్యాప్తు జరపాలి..

**విశ్వంభర, సుంకిశాల:** సుంకిశాల సైడ్వాల్ కూలిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, అందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీఎంఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన ప్రాంతాన్ని సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. నిర్మాణ పనులు చేస్తున్న మెగా ఇంజినీరింగ్ కన్స్ట్రక్షన్ కంపెనీ కాలపరిమితిలో నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ఈ ప్రాజెక్టుపై జరుగుతున్న పనులను పర్యవేక్షించడం లేదన్నారు. కూలిపోయిన సమయంలో పనిచేసే వారు లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదన్నారు. పర్వేదుల నుంచి సుంకిశాల ప్రాజెక్టు వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు కూడా చేయలేదన్నారు. నిర్మాణం చేస్తున్న సంస్థ కొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని, వరదలు పైనుంచి వస్తున్నప్పుడు సిమెంట్ పనులు చేయడం, సరిగా క్యూరింగ్ కాలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జరుగుతున్న పనులపై నిరంతరం పర్యవేక్షణ పెట్టి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని కోరింది.ఈ ప్రతినిధి బృందంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండా శ్రీశైలం, కూనురెడ్డి నాగిరెడ్డి ఉన్నారు.

# సీపీఆర్ పై ట్రైనింగ్



**విశ్వంభర, నాగోల్ :** ప్రకృతి విలువ అపార్ట్మెంట్స్ పతులగూడా నాగోల్ లో శనివారం యశోద హాస్పిటల్ సోమాజిగూడ వారి సౌజన్యంతో, అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ హరిబాబు రావు, అమరేందర్ రెడ్డి సమక్షంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా సిపిఆర్ ఎలా చేయాలనేది ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. అలాగే ఈసీజీ బీపీ ర్యాండమ్ బ్లడ్ షుగర్ టెస్ట్ లు కూడా చేయడం జరిగింది వందలాదిగా ఉత్సాహితులు పాల్గొన్నారు

# నాకు నమ్మకముంది

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ చర్చలు జరుపుతుందనేది తప్పుడు వార్త అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అనేది అవుట్ డేటెడ్ పార్టీ అని, అసలు ఆ పార్టీతో చర్చలు జరపాల్సిన అవసరమే తమకు లేదన్నారు. తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకే బీఆర్ఎస్ విలీనం అని ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు.శనివారం బీజేపీ కార్యాలయం లో మీడియాతో నిర్వహించిన చిట్చాట్లో బండి సంజయ్ మాట్లాడుతూ కేటీఆర్ను సీఎం రేవంత్ రెడ్డి జైల్లో వేస్తారనే నమ్మకం తనకు ఉందన్నారు. కేటీఆర్ చేసిన అరాచ కాలు, అవినీతి అందరికీ తెలుసన్నారు. తనతో సహా బీజేపీ కార్యకర్తలను కేటీఆర్ హింసించిన, జైల్లో వేసిన తీరును ఎవరూ మర్చిపోలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై నమ్మకం పోయిన రోజు నుంచి కాంగ్రెస్తో జరగబోయేది యుద్ధమే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటైనా బీజేపీ ధాటికి తట్టుకోలేనంతగా యుద్ధం చేస్తామన్నారు.

కవిత బెయి ల్కు, బీజేపీకి సంబంధం లేదన్నారు. సిసోదియాకు బెయిల్ వస్తే మా పార్టీకి సంబంధముందా? అని ప్రశ్నించారు. కోర్టు విషయాలను పార్టీతో ము డిపెట్టడం సరికాదన్నారు. నిజాయతీగా పని చేసే ఐఏఎస్లకూ నేటికీ పోస్టింగ్ ఇవ్వడం లేదని ఆందోళన



వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్కు కొమ్ముకాసిన ఐఏఎస్ లకే మళ్లీ మంచి పోస్టింగులిస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ఈ అంశంలో కాంగ్రెస్కు, బీఆర్ఎస్కు తేడా లేకుండా పోయిందని అసహనం వ్యక్తం చేశారు.

**స్థానిక ఎన్నికల్లో బ్రాండ్ అంబాసిడర్లు వారే..**

అతి తక్కువ సమయంలో ప్రజా వ్యతిరేకత చూరగొన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని బండి సంజయ్ స్పష్టం చేశారు. రాబోయే స్థాని క సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. పంచాయతీలకు నిధులిచ్చే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు కూడా ప్రోత్సాహక నిధులివ్వడం లేదన్నారు. కేంద్ర నిధులతోనే పంచాయతీలు నడుస్తున్నాయన్నారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీలే తమ బ్రాండ్ అంబాసిడర్లన్నారు. ఏ పార్టీ గెలిస్తే పంచాయతీలు అభివృద్ధి అవుతాయనేది గుండె మీద చేయి వేసుకుని ఆలోచించాలన్నారు.

పంచాయతీలకు కేంద్రమే నిధులిస్తోందని హరీశ్ రావు ఇప్పటికైనా చెప్పడం శుభపరిణామం అన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల భూముల కొనుగోలు దందా బాధ్యతను ఓ కాంగ్రెస్ నేతకు అప్పగించిందని ఆరోపించారు. తమ్ముడి కోసమే సీఎం రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లారనడం సరికాదన్నారు. రాజకీయాల్లో విమర్శలు చేసేటప్పుడు హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. కాంగ్రెస్లో లుకలుకలు మొదలయ్యాయన్నారు.

ఇతర పార్టీలను చీల్చి లాభం పొందాలనే ఆలోచన బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్కు ప్రజలు ఐదేళ్ల తీర్పు ఇచ్చారని, ఐదేళ్లు అధికారాన్ని ఉంచుకుంటారా? వదులుకుంటారా? అనేది ప్రభుత్వ తీరుపై ఆధారపడి ఉందన్నారు. పాతబస్తీలో రోహింగ్యాలున్న మాట వాస్తవమే కదా? ఆనాడు డిప్యూటీ సీఎం మహమూద్ అలీ రిబ్బన్ కటింగ్ చేశారు కదా? అని ఎద్దేవా చేశారు.

అసదుద్దీన్ ఒవైసీ ఎన్ని వక్ఫ్ బోర్డు భూములను కాపాడారో సమాధానం చెప్పాలన్నారు. ఒకచోట ఊరు ఊరంతా వక్ఫ్ బోర్డు భూములేనని చెప్పడం ఎంత వరకు న్యాయం? వాటికి సంబంధించిన భూములను ఎంత మంది పేద ముస్లింలకు ఇచ్చారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. ప్రైవేట్ భూములు కూడా చాలా చోట్ల వక్ఫ్ బోర్డులో ఉన్నాయి. పూర్తి విచారణ చేస్తే వివరాలు బయటకొస్తాయన్నారు. గతంలో వక్ఫ్ బోర్డు భూములను కాంగ్రెస్, ఎంఐఎం నేతలు చాలా చోట్ల కబ్జా చేశారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందితే వాస్తవాలన్నీ బయటకు వస్తాయన్నారు. తాను అందరి మనిషినని కొందరు కాదనుకుంటే తానేం చేయలేనన్నారు. పార్టీకి, శాసనసభ్యులకు మధ్య గ్యాప్ ఉందనేది సరికాదన్నారు. తన పార్లమెంట్ పరిధిలో 80 శాతానికిపైగా ఓట్లు నమోదు చేయించిన పోలింగ్ బూత్ కమిటీలను త్వరలోనే సన్మానిస్తా అని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధక్ష మార్పు జాతీయ అధ్యక్షులు నడ్డా చూసుకుంటారన్నారు. ఆ విషయంలో హైకమాండ్ నిర్ణయమే తమకు శిరోధార్యం అన్నారు.

# హైదరాబాద్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణకు ప్రణాళిక

- టెస్టింగ్ సదుపాయం ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థ
- ఉత్పత్తి పెంపుతో మరిన్ని ఉద్యోగాల కల్పనకు అవకాశం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందానికి లేఖను అందజేసిన మోనార్క్



**విశ్వంభర, హైదరాబాద్**

హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణకు మోనార్క్ ట్రాక్టర్స్ సంస్థ ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లోని తమ పరిశోధన-అభివృద్ధి సంస్థను విస్తరించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సంస్థ ప్రతినిధులు చర్చించారు. తెలంగాణకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మోనార్క్ ట్రాక్టర్స్ సంస్థ ప్రతినిధులు కలిశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో తమ ఆర్ అండ్ డీ సంస్థకు అనుబంధంగా స్వయంప్రతిపత్తి ట్రాక్టర్ టెస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హైటెక్, పర్యావరణ అనుకూల కంపెనీలను ఆకర్షించడంపై తాము దృష్టిసారించామని, మోనార్క్ ట్రాక్టర్స్‌ను తెలంగాణకు ఆహ్వానిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్వయంప్రతిపత్తి ,ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతలో తెలంగాణను అగ్రగామిగా నిలిపామని, ఆ విజన్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ భాగమై రాష్ట్రంలో తమ ఉనికిని విస్తరించుకోవాలని తాము ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో తమ కార్యకలాపాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇతర అధికారులను కలవడం ఎంతో సంతోషం కలిగించిదని మోనార్క్ ట్రాక్టర్స్ సీఈఓ ప్రవీణ్ పెన్మెత్స వెల్లడించారు. హైదరాబాద్‌లోని తమ ఆర్ అండ్ డి కేంద్రం అధునాతన డ్రైవర్-ఆప్షన్ స్మార్ట్ ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌లను రూపొందించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు తాము చూస్తున్నామని, ఫలితంగా హైదరాబాద్ ప్రాంతంలో మరింత ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తి స్వయంప్రతిపత్తి, డ్రైవర్ తోనూ, డ్రైవర్ లేకుండానే నడిచే స్మార్ట్ ఎలక్ట్రిక్ ట్రాక్టర్లతో మోనార్క్ ట్రాక్టర్స్ సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తోంది.

# ఫైలేరియా, నులిపురుగుల తీవ్రత తగ్గించేందుకు చర్యలు

- 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 25 వరకు డ్రైవ్
- ప్రారంభించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్టంలోని సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలో ఫైలేరియా(బోధకాలు), నులి పురుగుల తీవ్రతను తగ్గించేందుకు ఆరోగ్యశాఖ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ నెల 25 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి పోస్టర్ ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా శనివారం కార్యక్రమన్ని ప్రారంభించారు . ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం లో దాదాపు 2,600 మంది సిబ్బంది పాల్గొననున్నారు. ఇందులో 2522 మందికి మాస్ డ్రగ్ విధానంలో ఔషదాలు అందజేయనున్నారు. జాతీయ ఫైలేరియా,నులిపురుగుల నివారణ కార్యక్రమం లో భాగంగా కేంద్ర ఆయుష్ , వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ శనివారం నిర్వహించిన వర్చువల్ మీటింగ్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ఫైలేరియా, నులిపురుగుల నివారణ కు చేపడుతున్న చర్యలను కేంద్రమంత్రికి వివరించారు. రాష్ట్రంలో సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు బోధకాల వ్యాధి, నులిపురుగుల వ్యాధి నివారణకు డీఈసీ, ఆల్బెండజోల్ ,హైవర్ మెక్టిన్ మాత్రల డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సెక్రటరి క్రిస్టినా చొంగ్తూ, అడిషనల్ డైరెక్టర్ అమర్ సింగ్ నాయక్ లు పాల్గొన్నారు.






# ఆదర్శ ఫౌండేషన్‌లో అన్నదానం

**విశ్వంభర, చైతన్యపురి:** చైతన్యపురి డివిజన్ ప్రెసిడెంట్ తోట మహేష్ యాదవ్ జన్మదిన సందర్భంగా ఆదర్శ ఫౌండేషన్ లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . పుట్టినరోజు సందర్భంగా చైతన్యపురి పరిధిలో శ్రీశ్రీశ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామిని, కోసగుండ్ల ఫనిగిరి లక్ష్మీ నరసింహ స్వామీని దర్శించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంజి, ప్రవీణ్ చారి, నర్సింహారెడ్డి, రాజేష్, గణేష్, హరీష్ యాదవ్, యువసేన సభ్యులు.తదితరులు పాల్గొన్నారు.

# కంచకచర్ల పరిసర ప్రాంతాల్లో తారాస్థాయికి భూముల రేట్లు

**విశ్వంభర, అమరావతి:** కంచకచర్ల పరిసర ప్రాంతాల్లో భూముల రేట్లు తారా-స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. గత కొన్ని-రోజులుగా ఆ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లావాదేవీలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అక్కడ రియల్ భూం బాగా ఉన్నట్లు సమాచారం. గత ప్రభు-త్వం మూడు రాజధానులతో కుదేలైన రియల్ ఎస్టేట్ అమరావతి రాజధానిగా ప్రకటించిన తర్వాత అమరావతికి 50కి. మీ పరిధిలో భూముల రేట్లు నాలుగు రెట్లు అవ్వడం విశేషం. రియల్ ఎస్టేట్ వ్యాపా-రులు తమకు న్యాయం జరిగింది అని సంతోషం వ్యక్త పరుస్తున్నారు.



హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో కేథలిక్ రీజినల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆఫ్ తెలంగాణ(క్రిస్ట్) ఆధ్వర్యంలో 'తెలంగాణలో విద్య - గతం, వర్తమానం, భవిష్యత్తు దృక్పథాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన టీజేఎస్ చీఫ్ ప్రొ.కోదండరామ్

# పేదరికంతో ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కావద్దు

- కస్తూర్భా బాలికల విద్యాలయాలకు చేయుత
- కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్

**విశ్వంభర, కనగల్ :** పేదరికంతో ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కావద్దనే ఉద్దేశ్యంతోనే మా కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ తెలిపారు. మన ఊరి బడులను మనమే బాగుపర్చుకోవాలని, తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణం ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మా ఫౌండేషన్ బాలికల విద్యపై,అంగన్ వాడి పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టమాన్నారు. బాలికల కోసం సానిటరీ కిట్స్ , అంగన్వాడీ భవనాలను మరమ్మత్తు చేయడం ,నూతన అంగన్వాడీ భవనాలు నిర్మించడం జరుగుతుందని అన్నారు. నల్గొండ జిల్లా కనగల్లు మండల కేంద్రంలోని కస్తూర్భా గాంధీ బాలికల విద్యాలయంలో గోడలపై బొమ్మలు , ల్యాబ్ మెటీరియల్ , మైక్ సెట్ పాఠశాలకు సమకూర్చినందుకు కృతజ్ఞతలతో పాఠశాలలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బండారు స్వప్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కస్తూరి శ్రీ చరణ్ గారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సారాల నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కస్తూరి ఫౌండేషన్ సేవలందిస్తున్నారని, ఫౌండేషన్ ప్రారంభించిన నాటి నుండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కస్తూరి ఫౌండేషన్ ఒక విద్యారంగాన్ని బాగుపర్చడమే కాకుండా కరోనా సమయంలో పాఠశాలను సానిటైషన్ చేయడం, నిరు పేద కుటుంబాలకు కస్తూరి కళ్యాణమస్తు ద్వారా పెళ్లిళ్లకు పుస్తె,మెట్టలు అందించామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కస్తూర్భా విద్యాలయాలను పట్టించుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. నేటి సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు ముందున్నారని గుర్తు చేస్తూ మీరు కష్ట పడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి సమాజ సేవా చేయాలని కోరారు. కస్తూరి శ్రీ చరణ్ చేతుల మీదగా పాఠశాలలోని విద్యార్థినలకు నోట్ బుక్స్, స్టేషనరీ సామగ్రి, జూట్ బాగ్స్, గ్రామర్ బుక్స్, డిక్షనరీ బుక్సఅం దజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘము జిల్లా అధ్యక్షులు తిరందాసు సంతోష్, ఫౌండేషన్ సభ్యులు కంచర్ల రామకృష్ణ, మహేష్ , పిన్నింటి నరేందర్ రెడ్డి , సమ్మిడి నవీన్ రెడ్డి , మేకల అనిల్ కుమార్ , పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా కల్లేపల్లి రాజు జన్మదిన వేడుకలు

**విశ్వంభర, హైద్రాబాద్ :** ప్రముఖ సామాజికవేత్త , గ్రేటర్ పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి రాజు నేత జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. హైద్రాబాద్ లోని పలు చోట్ల పద్మశాలి సంఘాలు , చేనేత కార్మిక అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రాజు నేత పాల్గొని కేక్ కట్ చేసారు. వివిధ ప్రాంతాలలో ఆయన అభిమానులు కేక్ కట్ చేసి , బాణాసంచా కాల్చి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.



# తెలంగాణలో బీహారీ ట్యాక్సులు

**ఐఏఎస్ అంటే ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్... కానీ, మాజీ చీఫ్ సెక్రటరీ మాత్రం దానికి పెద్ద అర్థం వచ్చే చేశారంటే అతిశయోక్తి కాదు. ఐఏఎస్ అంటే పాలకులకు అన్ని పనులు చేయడం.. వారి అడుగులకు మడుగులొత్తడం అన్నట్టు ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో ఆయన వేసిన బీహారీ ట్యాక్స్ లు ప్రస్తుతం రాష్ట్రంలో గందరగోళం సృష్టిస్తున్నాయి. అదేంటో చూద్దాం. తెలంగాణలో ఐజీఎస్టీ (ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్) ఎగవేత ద్వారా రూ.1000 కోట్ల మోసం జరిగినట్లు తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ విభాగం తెలిపింది. ఈ వ్యవహారంపై నమోదైన కేసులో తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ పేరును ఏ5గా పోలీసులు చేర్చారు. ఇదే కేసులో ఏ1గా తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, ఏ2గా ఉప కమిషనర్ ఎ.శివరామ్ ప్రసాద్, ఏ3గా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ శోభన్ బాబు, ఏ4గా ప్లియంటో టెక్నాలజీస్ కంపెనీలు ఉన్నాయి. ఈ కుంభకోణంపై వాణిజ్య పన్నుల శాఖ సెంట్రల్ కంప్యూటర్ వింగ్ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్ (సెంట్రల్ క్రైం స్టేషన్) పోలీసులు కేసు నమోదు చేశారు.**




ప్రభుత్వానికి రావాల్సిన ట్యాక్స్ లను సొంత జేబులోకి తీసుకోవడం మహాపాపం. అటువంటి పాపానికి పాల్పడటం... వారిని శిక్షించడం అనివార్యమని చెప్పకతప్పదు. వ్యాపారుల నుంచి వాణిజ్య పన్నుల శాఖ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్‌లో భాగంగా సీజీఎస్టీ, ఎస్జీఎస్టీ, ఐజీఎస్టీ, సెస్ వసూలు చేస్తూ ఉంటుంది. బిగ్ లీఫ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ మానవ వనరులను సరఫరా చేస్తుంటుంది. ఈ సంస్థ పన్ను చెల్లించకుండానే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకుందనేది ఆరోపణ. 2023 డిసెంబరులో ఆ కంపెనీ పన్నుల చెల్లింపుపై చేసిన ఆడిట్‌లో రూ. 22.51 కోట్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకున్నట్టు తేలింది. ప్రభుత్వానికి ఎలాంటి పన్నులూ చెల్లించకుండానే ఈ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకున్నట్లు వాణిజ్య పన్నుల శాఖాధికారులు తేల్చారు. దీని మీద విచారణ ప్రారంభించిన వాణిజ్య పన్నుల విభాగం, మరి కొన్ని కంపెనీలు కూడా ఈ తరహాలోనే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొంది భారీ కుంభకోణానికి పాల్పడినట్టు గుర్తించారు. కొందరు వ్యాపారులు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను వివిధ రకాలుగా క్లెయిమ్ చేసుకుని మోసానికి పాల్పడ్డారని వాణిజ్య పన్నుల శాఖ సెంట్రల్ కంప్యూటర్ వింగ్ జాయింట్ కమిషనర్ రవి కానూరి మీడియాతో తెలిపారు. వ్యాపారులు ఏదైనా వస్తువు కొన్నప్పుడు తమ పెట్టుబడిపై కొంత పన్ను కడతుంటారు. ఆ వస్తువును ప్రాసెస్ చేసి.. మరొక రాష్ట్రానికి విక్రయించినప్పుడు మళ్లీ అమ్మకం పన్ను చెల్లిస్తారు. దీంతో కొనుగోలు పన్నును ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీన్ని అవకాశంగా తీసుకుని కొందరు వ్యాపారులు వస్తువుల కొనుగోలు, అమ్మకాలను కేవలం కాగితాలపైనే చూపించి ఇన్‌పుట్ క్రెడిట్‌ను పొందినట్టు తేలిందన్నది తెలిసిందే. ఇలా మొత్తం 11 కేసులకు సంబంధించి రూ. 400 కోట్ల కుంభకోణం జరిగినట్టు గుర్తించినట్టు సీసీఎస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ద్వారా బహిర్గతం అయింది. ఇందులో తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ కూడా ఉంది. ఈ సంస్థ కూడా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విషయంలో అవకతవకలకు పాల్పడిందని అధికారులు వెల్లడించారు. మరింత లోతుగా విచారణ చేయగా... దాదాపు రూ. 1000 కోట్ల కుంభకోణం జరిగినట్లు తేలిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బోగస్ క్లెయిమ్‌లకు పాల్పడకుండా ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఓ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వాణిజ్యపన్నుల శాఖ సమకూర్చుకుంది. తెలంగాణలో వ్యాపారుల ట్యాక్స్ రిటర్న్‌స్‌లో ఏమైనా తేడాలుంటే ఈ సాఫ్ట్‌వేర్ పసిగడుతుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించే ఐఐటీ హైదరాబాద్ వెంటనే ఆ సమాచారాన్ని వాణిజ్యపన్నుల శాఖకు అందిస్తుంది.

అయితే, బిగ్ లీఫ్ టెక్నాలజీస్ కంపెనీకి సంబంధించి ఆడిట్‌లో ఇన్‌పుట్ ట్యాక్స్ అదనంగా తీసుకున్నట్టు తేలినా.. ఈ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లోని 'స్క్రూటినీ మ్యాడ్యూల్' రికార్డు చేయలేదు. వాణిజ్య పన్నుల శాఖకు చెందిన అధికారి 2023 డిసెంబర్ 26న ఐఐటీలో విచారణ చేశారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పరంగా చేస్తున్న మోసాలు బయటకు రానివ్వకుండా చేసినట్లు ఆ విచారణలో తేలింది. సాఫ్ట్‌వేర్‌లో మార్పులకు అప్పటి వాణిజ్య పన్నుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కూడా ఉన్న సోమేశ్ కుమార్‌తోపాటు అదనపు కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామ్ ప్రసాద్ నుంచి వచ్చిన సూచనలే కారణమని, ఆ మేరకు స్క్రూటినీ రిపోర్ట్‌స్‌లో ఐజీఎస్టీలో అవకతవకలు రికార్డు కాకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు తేలింది'' అని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు రవి కానూరి. ఈ వ్యవహారంపై 2024 జనవరి 8న కాశీ విశ్వేశ్వరరావు, శివరామ్ ప్రసాద్‌కు వాణిజ్య పన్నుల శాఖ మెమో జారీ చేసింది. ఈ మెమోకు వారిద్దరూ సమాధానం ఇచ్చారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరించామని... ఐజీఎస్టీ, సీజీఎస్టీ, ఎస్జీఎస్టీ, సెస్ లోటుపాట్లు కప్పిపుచ్చేలా ఒక ఫార్మాట్ ఇచ్చామని వాళ్లు తెలిపారు. ఈ వ్యవహారంపై ఆడిట్ విభాగంతోపాటు సీడ్యాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్)తో పూర్తిస్థాయి ఆడిట్ చేయించింది వాణిజ్య పన్నుల శాఖ. జనవరి 30న ఆడిట్ వివరాల మీద చర్చించేందుకు సీడ్యాక్, ఐఐటీ హైదరాబాద్, వాణిజ్య పన్నుల శాఖాధికారులు సమావేశమయ్యారు. సోమేశ్ కుమార్, కాశీ విశ్వేశ్వరరావు, శివరామ్ ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌గా ఉన్న శోభన్‌బాబుతో స్పెషల్ ఇనీషియేటివ్స్ పేరిట వాట్సాప్ గ్రూప్ ఏర్పాటైంది. గ్రూపులో వచ్చే ఆదేశాలను శోభన్ బాబు పాటించేవారు. ఈ వ్యవహారంపై వాణిజ్య పన్నుల శాఖ ఇచ్చిన నోటీసుకు కాశీ విశ్వేశ్వరరావు సమాధానం ఇచ్చారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ పర్యవేక్షణలో వాట్సాప్ గ్రూప్ పనిచేసిందని, 2022 డిసెంబర్ నుంచి గ్రూప్ యాక్టివ్‌గా లేదు. ఫొటోలు, ఇతర వివరాల్లేకుండా వాట్సాప్ చాట్ హిస్టరీని ఇచ్చారు. దీంతో అన్ని వివరాలు ఇవ్వాలని వాణిజ్య పన్నుల శాఖ మరో మెమో ఇచ్చింది. వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు చేసిన విచారణలో మాత్రం 2024 ఫిబ్రవరిలోనూ వాట్సాప్ గ్రూపులో చాట్ నడిచినట్లు చెప్పారు. వాట్సాప్ చాట్ హిస్టరీని పరిశీలించినప్పుడు ఐజీఎస్టీ నష్టం గురించి రిపోర్టులు ఉన్నట్లు వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. అక్రమ కేసులు గుర్తించినా రిజిస్ట్రేషన్లు రద్దు చేయవద్దని ఆదేశాలు ఉన్నట్లు తేలింది. దీని ఆధారంగా కాశీ విశ్వేశ్వరరావు, శివరామ్ ప్రసాద్‌ల మొబైల్ ఫోన్లను జీఎస్టీ అదనపు కమిషనర్ ఎన్.సాయి కిశోర్ సీజ్ చేశారు. దీనిపై వారిద్దరూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. వారి పిటిషన్ తిరస్కరణకు గురైంది. సీడ్యాక్ ఇచ్చిన నివేదిక ప్రకారం.. 75 మంది పన్ను చెల్లింపుదారుల వివరాలను ఉద్దేశపూర్వకంగానే కప్పిపుచ్చారు. కొందరు అధికారుల, ఉద్యోగుల ఐడీలను కూడా కనిపించకుండా చేశారు. ఐఐటీ హైదరాబాద్, వాణిజ్య పన్నుల శాఖ డాటాబేస్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం నుంచి థర్డ్ పార్టీ నిర్వహించినట్లు తేలింది. దీనికి ఐపీ 103.168.83.131 గా ఉంది. పాస్‌వర్డ్ ప్లియాంటో గా ఉన్నట్లు తేలింది. ఐఐటీ హైదరాబాద్ తయారు చేసిన అప్లికేషన్ సర్వర్‌లోని వివరాలు స్పెషల్ ఇనీషియేటివ్స్ వాట్సాప్ గ్రూప్‌లోకి వెళ్లాయని తేలింది. వాణిజ్య పన్నుల శాఖలో చాలా అక్రమాలు జరిగినట్లుగా అల్గారిథమ్ గుర్తించిన విషయం ప్రొఫెసర్ శోభన్ బాబుకు తెలుసు. ఆ డేటాను ట్రాన్స్‌ఫర్ చేయాలని వాణిజ్య పన్నుల శాఖ ఎన్నిసార్లు అడిగినా చేయలేదు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ఫిబ్రవరి 8న మెయిల్లో స్పందిస్తూ.. ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఆదేశాలనే వాణిజ్య పన్నుల శాఖాధికారులు అనుసరిస్తున్నట్లు చెప్పారు. ఈ పరిణామాలన్నీ నిశితంగా పరిశీలిస్తే సోమేష్ కుమార్ కి క్రుష్ణ జన్మభూమికి వెళ్ళక తప్పదని తెలుస్తుంది.



- మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్ సత్తా పార్టీ,
రాష్ట్ర అధ్యక్షుడు
ఫోన్ :9550844433

# బడి

బడి
ఓ అమ్మ ఒడి
ఆ అమ్మ ఒడిలోకి
బుడిబుడి నడకలతో
వడి వడిగా చే రంగ
ఆ ఆనందాల లోగిలిలో
అక్షరాలే కౌగిలి లై
అక్కున చేర్చుకోగా
గణ గణ మని
గంటలు మ్రోగగా
గంటలే విద్యార్థుల
ఉన్నత లక్ష్యా లై
విద్యార్థి గణమంతా
ప్రార్థన ప్రాంగణం చేరగా
ప్రేయరే ప్రేరణగా
గురువే ఆదర్శంగా
తరగతి గదిలో చేరగా
గురువులే విద్యా తరువులై
విద్యాసారాన్ని బోధించే సార్లై
అదరక బెదరక విద్యార్థులు
ప్రశ్నలు ఎన్నో అడగగా
ఆ సమస్యల సాధనలో
సచ్చితంతో, సావదానంతో
సమస్యలను సాధించే
గుణశేఖరులు మా గురువులు
ఆటల్లో పాటల్లో
మాటల్లో ,చేతల్లో
ఉత్తమ గుణగనులు
మా ఉపాధ్యాయులు
మేలి మేలి విషయ లు ఎన్నో
మేలవించి ,మేల్కొల్పి
ఉత్తమ అంశాల
నొక్కి వాక్కానించి
జీవితపు లక్ష్యాల సారాన్ని
చక్కగా పక్కాగా చెప్పగా
శారీరక ,మానసిక
సమగ్ర మూర్తివత్వపు పూదోట
భావి భారత పౌరుల
తల రాతలు మార్చే
భవిష్యత్ తరాలకు కార్ఖానా మా బడి.



-కోటమర్తి వీరన్న
SA( తెలుగు)
జడ్.పి.హెచ్.ఎస్, అర్వపల్లి

## వైవిధ్యమైన అంశాలు పద్యాలై

# అరుణ శతకం

తెలుగు సాహిత్యంలో పద్యం అజరామరం.. వసివాడని సాహితీ ప్రసూనం పద్యం.. పద్యంలో వెల్లివిరిసిన అపురూపమైన ప్రక్రియ శతకం.. శతకానికి పదిశతాబ్దాల వారసత్వమున్నది. తెలుగు సాహిత్యంలో తరగనంత శతక సంపద పుష్కలంగా ఉంది. తన రచనాప్రస్థానం మొదలు పెట్టిన కవుల్లో ఎక్కువమంది శతకంతోనే సాహిత్య తెరంగేట్రం చేశారు. అదీ శతకానికున్న ప్రాధాన్యత. శతకం మానవాళికి జీవనపాథేయం చూపింది. నీతులను మూటగట్టి అందించింది. భక్తి కేతనమై ముక్తి మార్గంచూపింది. సామాజిక కోణంలో ఆవిష్కరింపబడి దిశానిర్దేశం చేసింది. అవసరమైతే సున్నితంగా హెచ్చరించింది. హాస్యం పండించింది. చమత్కారంతో అలరారింది. ఇన్నికోణాల్లో ఆవిష్కృతమయ్యే అవకాశముంది కాబట్టి శతకం మనుగడ సాగిస్తూ మనలను మనగలిగేలా చేసింది. కర్తకు సాహితీ మకుటమై శోభిల్లింది శతకం. శ్రీమతి అరుణాదేవిగారు భాషోపాధ్యాయినిగా తనచేతిమీదుగా అనేకమంది విద్యార్థి శిలలను శిల్పాలుగా చెక్కినవారు. అయితే ఇదివృత్తి సంబంధవిషయం. ప్రవృత్తి పరంగా వారు కవయిత్రి. వాట్సప్ సమూహాల్లో కవిత్వం పండిస్తూ పద్యసేద్యం చేస్తున్నవారు. పద్యపాథేయాన్ని ఎంచుకుని సగర్వంగా నిలబడ్డందుకు ముందుగా మనమందరం అరుణాదేవి గారిని అభినందించాల్సిందే! ఒక చక్కని మకుటం సిద్ధం చేసుకున్నారు వారు. "అవని గెలుపు బాట అరుణమాట!". వారు నుడివిన పద్యాలన్నీ అవనికి గెలుపుబాట చూపిస్తాయి. అవనికి గెలుపును చూపడమేమిటని మనం ఆశ్చర్యపోవచ్చుగాక! గురజాడ "దేశమంటే మట్టి కాదోయ్! దేశమంటే మనుషులోయ్!" అని అన్నాడుగదా! అందుకే అరుణ తన శతకం అవనికి గెలుపు బాటను చూపుతుంది అంటే అవనిపైనున్న ప్రజలందరికీ గెలుపుబాటనందిస్తుంది అని అర్థం చేసుకోవాల్సిందే!! అరుణగారి కలం నుండి జాలువారిన ఈ శతకంలోలమంచి మాటలన్నీ అలా ఒదిగిపోయాయి. మెదటి పదిపదిహేను పద్యాల్లో మాతృ పితృ గురు స్తుతి, ఇష్ట దైవస్తుతి కొనసాగింది. ఆ తర్వాత సామాజిక నిష్ఠతో శతక పద్యాలు అలరారాయి. శతకమంటేనే ప్రతిపద్యం వస్తు వైవిధ్యభరితం. కవిలోకం సమాజాన్ని లోతుగా దర్శిస్తుంది.. ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలిస్తుంది. అవసరమైన చోట తన రచనల ద్వారా మానసికంగా చికిత్స నందిస్తుంది. సరిగ్గా ఇదే పనిని మరింత లోతుగా అధ్యయన శీలతతో అరుణ కొనసాగించారు. పైగా వారు ఎంచుకున్న ఛందం ఆటవెలది. వేమన్న వేలాది నీతులను అందించిన అపురూప ఛందం గదా!

ఆ ఆటవెలదుల్లో ఈ అరుణనే ఆటవెలది పద్యాలాట ఆడేసిందనడంలో ఇసుమంత అతిశయోక్తి లేదు. ఒకటి రెండు పాదాల్లో ఏదోఒక సామాజికాంశం కొనసాగింది. మూడోపాదం ఒక చెణుకులా/ హెచ్చరికలా/ సందేశంలా శోభిల్లింది. నాలుగోపాదం ఎలాగూ మకుటమే! పద్యాలన్నీ ఈ ఏకసూత్రతతోనే నడిచాయి. ఈ శతకంలో స్త్రీ సంబంధ అంశాలపద్యాలకు కాస్త పెద్దపీట వేసింది రచయిత్రి. బహుశా తాను నిర్దేశం చేయకపోతే మరొకరు నిర్దేశించలేరని కాబోలు. నేనిక్కడ పద్యాలను ఉదహరించను గానీ అన్ని పద్యాలు చదివితే మీరూ నాతో ఏకీభవిస్తారు. వివిధ సామాజిక అంశాలపై పద్యాలతో చురకలు కూడా అంటించింది కవయిత్రి. అవసరమైన చోట సున్నితంగా మందలించింది. ఒకటిరెండుచోట్ల గట్టిగానే హెచ్చరించింది కూడా. ఏది చెప్పినా భారతీయ సాంస్కృతిక వారసత్వ పరిమళాలు శతకమంతా పరిమళించడం విశేషం. ఇదే ఇప్పుడు కావలసింది కూడా!!

ఇంకొంచెం లోతుగా అరుణశతకాన్ని అధ్యయనం చేస్తే, 'కన్నతల్లి మనసు కష్టపెట్టబోకు.." అన్న సుప్రసిద్ధ పద్యం మనకు తెలిసిందే! వీరు "కన్నబిడ్డ మనసు కష్టపెట్టకెపుడు.." అంటారు. ఎదుటి వారిని ఎగతాళి చేయకుమని, తల్లిదండ్రులను గౌరవించమని తెలుపుతూనే " "విభుడు ధైర్యమిచ్చె విద్యయందు; విజయములను పొంది వెతలన్ని తొలగగ.." అని స్త్రీ విజయం వెనుక పురుషుని పాత్రను గుర్తుచేస్తారు. రెతుఘనత, సెల్లు సొల్లు, సంస్కారవైశిష్ట్యం, అప్పుముప్పు, మాట శక్తి, కోపం నష్టాలు, మూర్ఖతత్వం, సాయం విలువ, సమదృష్టి, ఆధునిక సాంకేతిక అంశాలు,భారతీయత, కుటుంబభావన, కరోనా కష్టం, ఓర్పు గొప్పదనం, పర్యావరణ స్పృహ ఇలా వైవిధ్యమైన అంశాలు పద్యాలై ప్రతిబింబించాయి ఈశతకంలో! ప్రతిపద్యం నీతినో సందేశాన్నో అందిస్తుంది. చక్కని పద్యశతగుచ్ఛం పాఠకుల చెంతకు చేర్చిన అరుణ సాహితీచరిత్రలో తన పేరును నిలుపుకొన్నందుకు అభినందిస్తూ, భవిష్యత్తులో కవయిత్రిగా మరింత రాణించి పద్యసుధను వెలువరించాలని ఆకాంక్షిస్తున్నాను. కవయిత్రి అరుణ పద్యారుణ తేజమై వెలుగొందాలని అభిలషిస్తున్నాను. నాచే ఈ నాలుగు మాటలు రాయించిన పలుకులమ్మకు ప్రణతులర్పిస్తూ, పాఠకులను శతక పూదోటలోకి ఆహ్వానిస్తూ.. జై పద్యం!!

- అవుసుల భానుప్రకాశ్, 96032 04507

# చరిత్రలో మరుగునపడిన త్యాగధనుడు ఖుదీరాం

## స్వాతంత్ర్య సమరంలో తొలి బాంబు పేల్చిన ధీరుడు... ఆగస్టు 11 ఖుదీరాం బోస్ వర్ధంతి

1857 సిపాయిల తిరుగుబాటంటే మంగల్ పాండే, తాంత్యా తోపే, బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన నిర్భయమైన రాణి లక్ష్మీబాయి, కిట్టూరుకు చెందిన రాణి చెన్నమ్మ, రాణి గైడిన్లు, చంద్ర శేఖర్ ఆజాద్, రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్‌గురు, గురు రామ్ సింగ్, పాల్ రామసామి, రాజేంద్ర ప్రసాద్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, వీర్ సావర్కర్ వంటి లెక్కలేనన్ని మంది నాయకులు, గొప్ప వ్యక్తిత్వాలన్నీ స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గదర్శకులు. అలా దేశమాత దాస్య విముక్తి గావించడం కోసం ఎందరో వీరాధివీరులు, మహనీయులు తమ ప్రాణాలొడ్డి జీవితాలను అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పోరాట పటిమను, తెగువను, త్యాగాన్ని చూపించారు. ఎందరో తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. ఈ అసంఖ్యాక స్వాతంత్ర్యోద్యమాల కాలంలో ఎందరో అమరవీరులు ఉన్నారు. ఇందులో చరిత్ర చాలామందిని గ్రంథస్థం చేయలేక పోయింది. చేసినా కొందరిని చరిత్ర మరుగున పడేసింది. అలా చరిత్ర పొరల మాటున ఉన్న వారిలో యువ కిశోరం ఖుదీరాం ముఖ్యుడు. 18ఏళ్ల నూనూగు మీసాల యువ ఖుదీరాం బోస్ దేశం గర్వించదగ్గ త్యాగాన్ని మరిచినా, యాదృచ్ఛికంగా విస్మరించినా, దేశ స్వాతంత్ర్య చరిత్ర పరిపూర్ణం కానట్టే.

ఖుదీరాం బోస్ భారతీయ స్వాతంత్ర్య సమర వీరులలో మొదటి తరానికి చెందిన అతిపిన్న వయస్కుడు. భారత దేశ వాసులను వేధించిన బ్రిటిష్ అధికారిపై బాంబు వేసిన మొదటి సాహస వీరుడు ఖుదీరాం. ఆ కారణంగా అతనిని ఉరితీసే నాటికి అతని వయసు కేవలం 18 సంవత్సరాల 7 నెలల 11 రోజులు మాత్రమే.

ఖుదీరాం పశ్చిమ బెంగాల్, మిద్నాపూర్ జిల్లా హబిబ్‌పూర్‌లో 1889 డిసెంబర్ 3న జన్మించాడు.



చిన్ననాటి నుంచి స్వాతంత్య్ర కాంక్షతో రగిలి పోయేవాడు. మొదట్లో అఖ్రా అనే విప్లవ సంస్థలో చేరాడు. తన నాయకత్వ లక్షణాలు, సాహసోపేతమైన స్ఫూర్తితో ఆ సంస్థలో అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఆయన టీచర్ సత్యేంద్రనాథ్ బోస్, భగవద్గీతలను స్ఫూర్తిగా తీసుకున్నాడు. 1905లో బెంగాల్ విభజన అతడిలో బ్రిటిష్ ప్రభుత్వంపై మరింత కసి రేపింది. 16 ఏళ్ల వయసులోనే ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లను బాంబులతో పేల్చి వేశాడు.


1907 ఆగస్టు 26న ఒక కేసు విచారణ సందర్భంగా ఎంతోమంది యువకులు కోర్టు ముందర ఆసక్తిగా గుమికూడి ఉన్నారు. పరిస్థితి శాంతి యుతంగా ఉన్నప్పటికీ ఉన్నట్లుండి పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ వ్యవహారాన్ని అక్కడే ఉండి చూస్తున్న సుశీల్ కుమార్ సేన్ అనే 15 ఏళ్ళ యువకుడు భరించలేక ఆవేశంతో ఒక ఇంగ్లీష్ అధికారి ముక్కుమీద ఒక్కగుద్దు గుద్దాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్లారు. ఈ కేసు విచారణ చేసిన జడ్జి కింగ్స్ ఫోర్డ్ అనే అధికారి చిన్నవాడన్న దయ లేకుండా సుశీల్ కుమార్ కు15 కొరడా దెబ్బలను శిక్ష విధించాడు. సాహస వంతుడైన ఆ యువకుడు ప్రతి కొరడా దెబ్బకు వందేమాతరం అని నినదించాడు.

ఈ సంఘటన తరువాత స్వతంత్ర వీరులంతా కింగ్స్ ఫోర్డ్ కు గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నారు. మానవ రూపంలో ఉన్న మృగమైన ఫోర్డ్ లాంటి వారు ఉన్నంతవరకు దేశభక్త వీరులకు కష్టాలేనని భావించి అతనిని చంపడానికి నిశ్చయించుకున్నారు.

1908 ఏప్రిల్ మొదటి వారంలో జుగాంతర్ అనే విప్లవ సంస్థకి చెందిన విప్లవ వీరులు కొందరు కలకత్తలో ఒక ఇంటిలో రహస్యంగా సమావేశమై కింగ్స్ ఫోర్ట్ ను అంతం చెయ్యడానికి ఒక ప్రణాళిక రూపొందించి, అమలు చేయ సంకల్పించారు. ఆ సమావేశంలో అరవిందఘోష్ కూడా ఉన్నారు. ఖుదీరాం బోసునూ, ప్రఫుల్లచాకి అనే మరో నవ యువకుడినీ ఈ పనికై నియమించారు. 1908 ఏప్రిల్ 30 రాత్రివేళ వీరిద్దరూ ముజఫర్ పూర్ లోని యురోపియన్ క్లబ్ కు ఒకబాంబు, రివాల్వర్ తీసుకొని వెళ్లారు. కింగ్స్ ఫోర్డ్ వాహనం క్లబ్ బయటకు రాగానే దానిపైకి బాంబును విసిరేసి ఇద్దరు పరిగెత్తి వెళ్లి పోయారు.అయితే, ఖుదీరాం, ప్రఫుల్లచాకిలు ఆ వాహనంలో కింగ్స్ ఫోర్డ్ లేరని గమనించ లేదు. కానీ అతని భార్య, కుమార్తెలు మాత్రమే ఉన్నారు. దీంతో వారు బలయ్యారు. ఒక రైల్వే స్టేషన్‌లో టీ తాగుతుండగా ఖుదీరాం బోస్‌ను పోలీసులు పట్టుకో గలిగారు. ఖుదీరాంను నిర్బంధించి రెండు నెలల పాటు విచారణ చేశారు. ముజఫర్ పూర్ బాంబు కేసులో ఫోర్డ్ భార్య, కుమార్తెల మరణానికి కారకుడైన ఖుదీరాంకు మరణశిక్ష విధించారు. 1908 ఆగష్టు 11న ఈ శిక్ష అమలు పరచబడింది. పెదవులపై చిరునవ్వు చెదరకుండా ఖుదీరాం మృత్యువును ఆహ్వానించాడు. దేశం కోసం బలిదానం చేశాడు. బోస్ పట్టుబడిన రైల్వే స్టేషన్‌కు ఖుదీరాం బోస్ పూసా అని ఈ మధ్యే పేరు పెట్టారు.

మాతృ భూమికోసం త్యాగం చెయ్యటం అందరికీ దొరికే అదృష్టం కాదు... అది నాకు లభించింది. అందుకు నేనెంతో గర్వ పడుతున్నాను. అయితే నేను అనుకున్నది సాధించలేదు. క్రూరుడైన కింగ్స్ ఫోర్డ్ ను శిక్షించలేక పోయాను. అదే నా బాధ... అంటూ 1908 ఆగష్టు 19 ఉదయం ఒక చేతిలో భగవద్గీత పట్టుకుని, ఉరికంబం దగ్గరికి వెళుతూ, ఉరితాడు బిగించమని, తలారి ఉరితాడు బిగిస్తుండగా 'వందేమాతరం' అని తుదిశ్వాస విడిచి అమరుడైన దేశ భక్తుడు ఖుదీరాం.

75ఏళ్ళ స్వతంత్ర భారతం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న వేళ...అలనాటి వీరుల, త్యాగధనుల జీవిత చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. త్యాగ మూర్తుల జీవిత కథలు, వారి జీవన పోరాటాలు, నేటి, రాబోయే తరాలకు జీవిత పాఠం నేర్ప గలగాలి. ఆ ప్రయత్నం ప్రతి దేశవాసీ చేయాలి. వారి త్యాగ పరంపరలను తర్వాతి తరానికి బోధిస్తేనే చైతన్యం కలిగి, వారిని నిరంతరం ఉత్తేజ పరచ దానికి గత చరిత్ర సాక్ష్యంగా నిలవాలి.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



**విశ్వంభర, ఎల్బీనగర్:** కుల గణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. శనివారం కాచిగూడలో జరిగిన మీడియా సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన ప్రక్రియ చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. రాహుల్ గాంధీ దేశంలో కులగణన బీసీ రిజర్వేషన్ల పై పార్లమెంట్ లో బీజేపీ తో కొట్లాడుతుంటే ఆయన స్ఫూర్తితో పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బీసీ రిజర్వేషన్లు కల్పించే విషయంలో స్పష్టత లేకపోవడం శోచనీయం అని అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని సీఎం ప్రకటించారని, అయితే కులగణన చేపట్టకుండా స్థానిక సంస్థల రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామన్నారు. పెండింగ్ లో ఉన్న బీసీ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ ఫ్రంట్ అధ్యక్షుడు గొరిగి మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి నంద గోపాల్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు రామ కృష్ణ, బీసీ దళ్ చైర్మన్ ఉదయ్ పాల్గొన్నారు.



## ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్

**విశ్వంభర, చింతపల్లి:** భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బీజేపీ మండల అధ్యక్షులు శివర్ల రమేష్ ఆధ్వర్యంలో శనివారం హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో చింతపల్లి మండల కేంద్రంలో ఉన్న మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు విచ్చేసి దిశా నిర్దేశం చేశారు. మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ పరిసరాలను పరిశుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సముద్రాల నగేష్, సీనియర్ నాయకులు కుక్కడపు రామకృష్ణ, దళిత మోర్చా నాయకులు నల్ల సైదులు, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్, బీజేవైఎం జిల్లా నాయకులు కుందేళ్ళ చెన్నకేశవ, బీజేవైఎం మండల అధ్యక్షులు శ్రీశైలం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జె అభినవ్, బూత్ అధ్యక్షులు మోర వెంకటరమణ, రాపర్తి సతీష్, నాళ్ల శివకుమార్, నగేష్ పాల్గొన్నారు.

## యోగా సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

**ఇస్మాయిల్ గురూజీ**




**విశ్వంభర, ఎల్బీనగర్:** ప్రతిరోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రముఖ యోగ గురూజీ ఇస్మాయిల్ అన్నారు. శనివారం సరూర్నగర్ హుడా కాంప్లెక్స్ గురు నిలయం ఆధ్వర్యంలో నిత్య యోగ సాధన కేంద్రంలో "ప్రతిరోజు యోగా చేద్దాం- రండి మాతో కలవండి" అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రకరకాల మానసిక శారీరక ఆధ్యాత్మిక అనారోగ్యాల నుంచి బయటపడడానికి పూర్వకాలం ఋషులు మనకు అందించిన యోగ విద్య చాలా బాగా ఉపయోగపడుతుందని అని అన్నారు. హుడా కాంప్లెక్స్ లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ లో ప్రతిరోజు ఉదయం 5 గంటల నుండి 6 గంటల వరకు ఈ నిత్య యోగ సాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇతర రాష్ట్రాల్లో కూడా నిత్య యోగ సాధన చేసుకోవడానికి అనుగుణంగా ఆన్లైన్ యోగ సాధన కార్యక్రమాన్ని ప్రతిరోజు ఉదయం 6:30 గంటల నుండి 7:30 గంటల వరకు అందజేయుచున్నట్లు తెలియజేశారు. కొత్తగా యోగ నేర్చుకోవాలనుకునే వారు యోగ నేర్చుకొని ప్రతిరోజు సాధన చేయాలనుకునే వారు రకరకాల అనారోగ్యాలతో బాధపడుతూ యోగా ద్వారా తగ్గించుకోవాలి అనుకునేవారు ఈ నిత్య యోగ సాధనలో పాల్గొని వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూర మల్సూర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కవిత రెడ్డి, మంజుల రెడ్డి పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా బాణాల నియామకం

**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ కి చెందిన బాణాల ప్రవీణ్ కుమార్ బి జే పి రాష్ట్ర కార్యదర్శి గా( ఎస్సీ మోర్చా) నియమకం అయ్యారు. ఈ మేరకు శనివారం ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ నియామక పత్రాన్ని ప్రవీణ్ కు రాష్ట్ర కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్బంగా బాణాల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా (ఎస్సీ మోర్చా) నియమించినందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డికి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్ రెడ్డి, ఆర్కే పురం కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



## బీసీ సత్యాగ్రహ దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపిన ఎంపీ వద్దిరాజు



**విశ్వంభర, హైదరాబాద్:** కులగణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో 42%రిజర్వేషన్స్ కల్పించాలంటూ బీసీలు సత్యాగ్రహ దీక్ష చేబూనారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద శనివారం చేపట్టిన ఈ దీక్షకు రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ బీసీల న్యాయమైన హక్కుల సాధనకు సత్యాగ్రహ దీక్ష చేస్తున్న యువ కిశోరాలకు అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల న్యాయమైన వాటా, కులగణన కోసం మీరు చేస్తున్న ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాని అన్నారు. జనాభాలో సగభాగం కంటే ఎక్కువ ఉన్న మన బీసీలకు రాజకీయాలలో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ బీసీ అయి ఉండి కూడా కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో బీసీలకు సముచిత గౌరవం లేదన్నారు. మున్నూరుకాపు, ముదిరాజ్, యాదవ, విశ్వ బ్రాహ్మణులు, రజకులు మంత్రివర్గంలో ఒక్కరూ కూడా లేరు కులగణన వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్స్ కల్పనకు మనమందరం మరింత సంఘటితమై పోరాడి న్యాయమైన హక్కుల్ని సాధించుకుందామని ఎంపీ వద్దిరాజు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**విశ్వంభర, మహేశ్వరం:** ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం చిన్న తూప్రాన్ గ్రామంలో తీగల అనితారెడ్డి ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం, డెంటల్ క్యాంప్ కార్యక్రమాన్ని మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న అనారోగ్య సమస్యలకే పెద్ద హాస్పిటలకు వెళ్లకుండా, ఇలాంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ దాదాపు ఈ వైద్య శిబిరంలో 150 మంది వరకు పరీక్షలు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ లయన్ డాక్టర్ బి విజయ రంగ, సన్ రైస్ హాస్పిటల్ డాక్టర్ కంభం నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకి వినతి పత్రం సమర్పించిన ముస్లిం మైనారిటీ నాయకులు



**విశ్వంభర, నకిరేకల్:** ముస్లిం ఐక్య కార్యాచరణ సమైక్య వేదిక ఆధ్వర్యంలో నకిరేకల్ నియోజకవర్గం నార్కెట్పల్లి, అమ్మనబోలు, కట్టంగూరు, అక్కనపల్లి, రామన్నపేట, ఐటిపాముల, ఏపీ లింగోటం మండల, గ్రామ ముస్లిం మైనారిటీ సోదరులు నకిరేకల్ లో సఎమ్మెల్యే వేముల వీరేశంతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముస్లిం మైనార్టీ సమస్యలపై మజీద్, ఖబర్, వస్తాన్ ప్రహరి గోడల నిర్మాణం కొరకు ఎమ్మెల్యేకి వినతి పత్రం సమర్పించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందనపై ముస్లిం మైనార్టీ నకరేకల్ నియోజకవర్గ సోదరులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వర్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ఇండియా కూటమి రాహుల్ గాంధీ నేతృత్వంలో వ్యతిరేకించడం హర్షించదగ్గ విషయమని ముస్లిం సోదరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు ఎండి సర్వర్ అలీ, ఎండి కైసర్, ఎండి అమీన్, ఎం డి అక్రమ్, నన్నేసాహెబ్, లతీఫ్ ఖాన్, సమీర్, మోబిన్, ఖాజా మొయినుద్దీన్, లాలు, సయ్యద్ బాషా, ఖాలిద్బాష, 200 మంది ముస్లిం మైనార్టీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తా యాదవ్, మాజీ సర్పంచ్ నూకల శంకర్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాలి



**విశ్వంభర, తలకొండపల్లి:** ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆయన తలకొండపల్లి మండలం పడకల్ గేటు వద్ద ఢోకూరి ప్రభాకర్ రెడ్డి తండ్రి డోకూరి రాంరెడ్డి స్మారకార్థం నిర్మించిన దేవుని పడకల్ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రి ఉన్న నేను పాలమూరు జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇస్తానని అందులో కల్వకుర్తికి మరింత ప్రాధాన్యత ఇచ్చి టూరిజం హబ్ గా మారుస్తానని అన్నారు. మన పూర్వీకులు అందించిన సంస్కృతి సంప్రదాయాలను విస్మరించకుండా ప్రతి ఒక్కరూ కొనసాగించాలని, కల్చరల్ అంటే సంగీతం, నృత్యం కాదని సంస్కృతి సంప్రదాయాలు అని తెలియజేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ జూపల్లి కృష్ణారావు జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి కడ్తాల్ నుండి తలకొండపల్లి రోడ్డు మార్గంలో కిలోమీటరున్నర అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు అనుమతి ఇవ్వాలని కల్వకుర్తి నియోజక వర్గానికి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్ల నర్సింహారెడ్డి, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, పీసీసీ కార్యవర్గ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, కిసాన్ సెల్ నాయకులు మోహన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్, అజీమ్, రవీందర్, పడకల్ మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.



## రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షునిగా బాదం శ్రీనివాస్

**విశ్వంభర, పరిగి:** పరిగి పట్టణానికి చెందిన బాదం శ్రీనివాస్ వికారాబాద్ జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైనట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాదం శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అనుకూలంగా ఉండటం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.



మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మీ జన్మదినోత్సవం సందర్భంగా తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభరాణి శనివారం రోజు మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.
– విశ్వంభర, ఆత్మకూరు(ఎం)



## నిరుపేద ఆడపడుచు పెళ్లికి
# 50 కిలోల బియ్యం వితరణ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** నిరుపేద కుటుంబానికి చెందిన ఆడపిల్ల పెళ్లికి యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన బాల్ద శ్రీశైలం ఆసరాగా నిలిచాడు. మండల కేంద్రానికి చెందిన బెల్లంకొండ లక్ష్మి కీర్తిశేషులు ముత్యాలుల ఏకైక పుత్రిక రమ్యశ్రీ వివాహం ఆదివారం జరగనుంది. ఈ సందర్భంగా వారి కుటుంబానికి శ్రీశైలం ఆరెగూడెంలో రమ్యశ్రీ కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా బాల్ద శ్రీశైలం మాట్లాడుతూ రాజకీయాలు, కులమతాలకు అతీతంగా నిరుపేదలకు తన తోచిన సాయం చేస్తానని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు భూమండల శ్రీనివాస్, కురుమ సంఘం అధ్యక్షులు బాల సిద్ధులు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు భూమండ్ల అశోక్, మైనారిటీ నాయకుడు ఎండి లతీఫ్ పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి
# జన్మదిన వేడుకలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వయంభు గణపతి ఆలయంలో పూజా కార్యక్రమం నిర్వహించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రేడ్, పండ్ల పంపిణీ చేశారు. జన్మదినం సందర్బంగా బాబు జగ్జీవన్ రావు చౌరస్తాలో 100 మంది రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవీ కిరణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు పాల్గొనారు.

## కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, నిజాంపేట్:** కుతుబ్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూ టీ మేయర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మండపం కమ్యూనిటీ హాల్ లో డిప్యూ టీ మేయర్ పుట్టిన రోజు సందర్బంగా మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి వారిని శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు, అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, అభిమానులు, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మౌలిక వసతుల కల్పనకు
# ఎన్ని నిధులైన వెచ్చిస్తాం

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం 125 డివిజన్ కైలాష్ హిల్స్ లో 29.60 లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ లోని అన్ని డివిజన్లతో పాటు, నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ఎన్ని నిధులైన వెచ్చిస్తానని తెలియజేశారు. అనంతరం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో సన్నిహితుడికి పరామర్శించిన ఎంపీ వద్దిరాజు



**విశ్వంభర, హైదరాబాద్:** జ్వరంతో ఆస్పత్రిలో చేరిన తన సన్నిహితుడు బత్తినీడు ఆది విష్ణుమూర్తిని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. విష్ణుమూర్తి జ్వరంతో బాధపడుతూ బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలియడంతో ఎంపీ రవిచంద్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది, మిత్రుడు చెరుకూరి శేషగిరిరావు, తన అనుచరుడు జన్నాయికోడే జగన్మోహన్ తదితరులతో కలిసి శనివారం ఆస్పత్రికి వెళ్లి విష్ణుమూర్తిని పరామర్శించి, త్వరితగతిన కోలుకోవాలని మనసారా ఆకాంక్షించారు. ఎంపీ వద్దిరాజు వైద్యులతో మాట్లాడి విష్ణుమూర్తి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులను ఎంపీ వద్దిరాజు కోరారు.

## ఉపాధి హామీ పథకాన్ని
# నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం




**విశ్వంభర, దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నిర్మాణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నర్సింహా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీ పనికి 70 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2,70,000 కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు పని దినాలు పెంచి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 700 రూపాయలు రోజువారి కూలీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో కూడా ఉపాధి హామీ పనిని ప్రవేశపెట్టాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని వృద్ధాప్య పెన్షన్, వితంతు పెన్షన్, వికలాంగుల పెన్షన్, ఒంటరి మహిళల పెన్షన్ వెంటనే అమలు చేయాలన్నారు. ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కొరకు ఆరు లక్షల నగదు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న వారికి గృహ లక్ష్మి పథకం ద్వారా ఆరు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి సీపీఐ దేవరకొండ, చందంపేట మండల కార్యదర్శులు దేపా సుదర్శన్ రెడ్డి, ఉప్పునుంతల వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మోగిల్ల వెంగళయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వేముల బుచ్చయ్య, మండల అధ్యక్షులు, కార్యదర్శులు కిన్నెర భారీములు, ఎలిమినేటి హుస్సేన్, కూన వెంకటయ్య పాల్గొన్నారు.

## బీజేపీ మండల కార్యకర్తల
# విస్తృత స్థాయి సమావేశం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో రూరల్ మున్సిపాలిటీ కార్యకర్తల కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని శనివారం స్థానిక భవాని గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి మహబూబ్ నగర్ పార్లమెంట్ కో కన్వీనర్ నర్సింహ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాజీ జడ్పీటీసీ కండే హరిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రైతులకు రైతుబంధు పదివేల నుండి 15 వేలు చేస్తామన్నారు, కౌలు రైతులకు 12 వేలు ఇస్తా అని ఇవ్వలేదని, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, 4 వేల రూపాయల వృద్ధాప్య పింఛన్లు, మహిళకు 2500 రూపాయల ప్రస్తావన వంటి హామీలను అమలు కాలేదన్నారు. విశ్వసనీయతకు, ఇచ్చిన మాటకు కట్టుబడే పార్టీ భారతీయ జనతా పార్టీ అని రాబోయే రోజుల్లో బీజేపీకే పట్టం కడతామనే భావన ప్రజల్లో వచ్చిందని, గ్రామ పంచాయతీ సర్పంచ్ వార్డు మెంబర్ దగ్గర నుండి జిల్లా పరిషత్, మున్సిపాలిటీ కౌన్సిలర్ వరకు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్, రూరల్ అధ్యక్షుడు లక్ష్మణ్ రావు, అసెంబ్లీ కో కన్వీనర్ గోరటి నరసింహ, మున్సిపాలిటీ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్, విజయ్ కృష్ణ చెన్నకేశవులు, కృష్ణ యాదవ్, గోజ ఆనందు, రావిరథోడ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతి చెందిన యువకుని కుటుంబానికి ఆర్థిక చేయూత

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన యాట వేణు (35) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో నేతాజీ యువజన మండలి సభ్యుల సహకారంతో సమకూర్చిన 15,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతుని తల్లి జయమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన మండలి ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి మురళీకృష్ణ, మాజీ అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్, సభ్యులు దొంతరబోయిన మురళీకృష్ణ, దామోదర్ రెడ్డి, తవిటి రాజు, ఎలగందుల మహేష్, చిత్తర్ల అనిల్, యాస మహేందర్ రెడ్డి, గుండెగాని కిరణ్ పాల్గొన్నారు.



## కొరటికల్ జడ్పీహెచ్ఎస్‌కి ఆంప్లీఫైర్ బహూకరణ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కొరటీకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 15,000 ల రూపాయల విలువ గల ఆంప్లీఫైర్ ను భువనేశ్వరి గ్రూప్ అధినేత శ్రీరెడ్డి ఆనంద నర్సింహ్మా స్వామి ప్రధానోపాధ్యాయులు డి. వెంకన్నకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఫౌండర్ కూరల శ్రీనివాస్, పదవ తరగతి మొదటి బ్యాచ్ విద్యార్థి జైపాల్ రెడ్డి, స్వామి, వరప్రసాద్, జగత్ సింగ్, పేరెంట్స్ మహేష్, నర్సింహ పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌పై మండిపడ్డ సిపిఎం నేత

**విశ్వంభర, ఖమ్మం :** దుమ్ముగూడెం ప్రాజెక్టు దుమ్ము పట్టిందని, సీతారామ ప్రాజెక్టు కొలిక్కి రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఈ సందర్బంగా ఖమ్మం పట్టణంలోని సిపిఎం పార్టీ ఖానాపురం హవేలీ రామకృష్ణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, మహిళలకు ఉచిత బస్సు అమలు, ఐదు గ్యారంటీలు అటకెక్కాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న తీరు ప్రజలకు పథకాల పేరుతో అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు.

# దామగుండం అడవి విధ్వంసం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

- ఎన్నో ఔషధ మొక్కలు ఉన్న దామ గుండం అటవీ ప్రాంతం
- వికారాబాద్ జిల్లా మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణం
- దామగుండమును ఈ గండం నుండి తప్పించకపోతే మనకు యమగండమే
- పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి గీత



**విశ్వంభర, వికారాబాద్:** ఉత్తర తెలంగాణకు ఆక్సిజన్ అందించే వికారాబాద్ అడవిలో ఉన్నటువంటి పూడూర్ దామగుండం ఆడవిలో 16000 ( పదహారు వేల) రకాల చెట్లు, ఔషధ గుణాలు కలిగి ఉన్నటువంటి (మెడిసినల్ ప్లాంట్స్) చెట్లు ఉండడం వల్ల వాటి గాలిలో అనేక రోగాలను నయం చేసే మహత్యంఉన్నట్లుగా వర్ణిస్తారు. 500 అరుదైన చెట్లు రెండువేల సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతనమైన చెట్లు వీటితోపాటు వివిధ రకాల జంతువులు, పక్షులు అనేక రకాలైన జీవరాసులు ఈ అడవిలో ఉన్నాయి. మొత్తం 12 లక్షల చెట్లను కొట్టి వేయడానికి ఫారెస్ట్, రెవెన్యూ, ఎండోమెంట్, పర్యావరణం ఇలా మొత్తం 16 శాఖలు కండ్లు మూసుకొని వీ ఎల్ ఎఫ్ రాడార్ స్టేషన్ కోసం అనుమతులు ఇస్తూ దామగుండం అడవి విధ్వంసానికి సహకరిస్తున్నాయి. బలమైన రాజకీయ ఒత్తిడిలా లేకుంటే ఆర్థిక ప్యాకేజీల మహత్యమా మరి ఆయా శాఖ అధికారులకే తెలియాలి. ఇది 2010లో నిర్ణయమైనప్పటికీ పర్యావరణవేత్తలు శాస్త్రవేత్తల పోరాటం తో ఆగిపోయింది. మళ్లీ ఇప్పుడు తిరిగి కొనసాగించడం అంటే పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల హెచ్చరికలను లెక్కచేయక పోవడం అంటే ప్రకృతి విధ్వంసానికి ఒడిగట్టినట్లే. ఇంతటి వృక్ష సంపదను విధ్వంసం చేయడం వల్ల వికారాబాద్ కు వచ్చే లాభమేమిటి అంటే "0", కానీ నష్టమైతే ఉంది. వీఎల్ఎఫ్ నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణంతో దామగుండం నుండి ఎటు చూసినా 70 కిలోమీటర్లు రేడియేషన్ ప్రమాదం లో పడబోతుంది. ఇప్పటికే యూఎస్ లోని విచ్గన్ ఫారెస్ట్ వీఎల్ఎఫ్ తో ధ్వంసం అయ్యింది. ఈ రేడియేషన్ ప్రభావాన్ని అంచనా వేసిన 11 రాష్ట్రాలు వీఎల్ఎఫ్ ప్రాజెక్టును నిరాకరించాయి. దేశంలో 106255 నిరుపయోగంగా ఉన్న భూములు ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి అనువైనవి గా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లాలో బంగారం గనుల మైనింగ్ జరిగినటువంటి ప్రాంతం లాంటి అనువైన స్థలాలు చాలా ఉన్నాయి. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలోని పరిగిలో ఏర్పాటుకు ప్రభుత్వం సాగతిస్తున్నది ముఖ్యంగా అప్పుడు ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న రామ్మోహన్ రెడ్డి ఈ అడవి విధ్వంసానికి కంకణ బద్ధులై ఉన్నారు. కారణం స్వలాభమా లేదా ప్రాంత అభివృద్ధి కోసమా అని చూసినట్లయితే నేవీలో అడపాదడపాక ఉద్యోగాలు ఇవ్వడానికి కుదరదు నేవీ రిక్రూట్మెంట్ కు ఒక విధానము ఉంటుంది ఆ పద్ధతుల ప్రకారం స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం కుదరదు. వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ రావడం వల్ల అభివృద్ధి జరుగుతుంది. ప్రపంచం అంతా ఇటు చూస్తుంది అని చెప్తున్నారు. కానీ వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో ఇక్కడ ఉన్న ప్రజలు రేడియేషన్ కారణంగా తట్ట, బుట్టా సర్దుకొని పోయే పరిస్థితి రావచ్చు అని ప్రపంచమంత దామగుండాన్ని జాలిగా చూస్తుంది. వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ తో ఈ ప్రాంతానికి ఎలాంటి ఉపయోగం లేనప్పుడు 12 లక్షల చెట్లను నరకడం వల్ల ఎమ్మెల్యేకి డ్రీమ్ ప్రాజెక్టు ఎట్లా అయితది. ఈ స్టేషన్ రావడంతో ఎమ్మెల్యే అభివృద్ధి చెందుతారా? ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి చెందుతారా? అనేది శోచనీయమే. వికారాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత చారిత్రక రూపాలు కనుమరుగయ్యేలా ఈసా, మూసీ, కాగ్న నదుల జన్మస్థలం కృష్ణ ఉపనదులు ప్రమాదంలో పడబోతున్నాయి. హుస్సేన్ సాగర్ మనుగడ ప్రశ్నార్థకంగా మారబోతుంది. 2,900 ఎకరాలు అడివి, 12 లక్షల వృక్షాలు పోవడంతో జిల్లాలో చారిత్రక రూపాలు కనుమరుగాడవడం తో పాటు బోర్లు, బావులు ఎండిపోతాయి. జిల్లాలో బలమైన నీటి వనరులు లేక పేద రైతులు వర్షాల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. మధ్యతరగతి రైతులు కొంత ఆర్థికంగా అప్పులు చేసి బోర్లు బావులు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేస్తున్నారు. దామగుండం అడవి ధ్వంసంతో బోర్లు బావులు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే జిల్లాలో ఉపాధి అవకాశాలు లేక యువత అతలాకుతలమైతున్న నిరుద్యోగ జిల్లాగా పేరున్న వికారాబాద్ జిల్లాలో ఎంతో కొంత వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను కూడా నీటి నిల్వలు లేకుండా చేసి నష్టాలపాలు చేయకూడదు. వికారాబాద్ జిల్లా మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణం కొరకు ఇచ్చినా అనుమతులు అన్నింటిని రద్దు చేయాలి. ఈ ప్రాజెక్టును దామగుండం అడవిలో ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం నుండి హామీ వచ్చేవరకు వికారాబాద్ జిల్లా ప్రజలు బలమైన ప్రజా పోరాటాలు నిర్వహించవలసి ఉన్నది " దామగుండంను ఈ గండం నుండి తప్పించకపోతే మనకు యమగండమే " కాబట్టి వికారాబాద్ జిల్లా ప్రస్తుత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు ,రాజకీయ నాయకులు, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, కార్మిక, రైతు, మహిళ, పాత్రికేయ, ఉద్యోగ, వైద్య, న్యాయ, మానవ హక్కుల సంఘాల నాయకులారా గొంతెత్తి ప్రశ్నించకుంటే ప్రమాదాన్ని చవిచూడాల్సిందే మనమే. దామగుండం అడవి విధ్వంసాన్ని ఆపడంలో న్యాయపరంగా వరల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972, ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్ 1927, ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986, పిసా యాక్ట్ 1996 లు మనకు తోడ్పడతాయి. దేశంలో ఇప్పటికే సేవ్ దామగుండం అని నినదిస్తూ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు నిరసనలు ప్రారంభమైనాయి. దేశ విదేశాల్లో కూడా పర్యావరణ వేత్తలు మద్దతు ప్రకటిస్తున్నారు కానీ స్థానికంగా మనం కదలక పోవడం వల్ల ప్రభుత్వం వేగాన్ని పెంచుతుంది. కాబట్టి వికారాబాద్ జిల్లా ప్రజల ఉగ్రరూపాన్ని ప్రదర్శించాలి. ఉత్తరప్రదేశ్లో 1973లో అప్పటి ప్రభుత్వం 300 చెట్లను నరికేందుకు అనుమతి ఇస్తే చెట్లతో పాటు మమ్మల్ని నరకండి అని పోరాడిన అడవి సత్యాగ్రహం అయినటువంటి చిప్కో ఉద్యమస్ఫూర్తితో పోరాడుదాం! దామగుండం అడవిని 12 లక్షల చెట్లను కాపాడుకుందామని అన్నారు.

## క్రెడాయ్ ప్రాపర్టీ షోలో నటి శ్రీలీల



**విశ్వంభర, హైదరాబాద్ :** కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోలో టాలీవుడ్ సినీ నటి శ్రీలీల పాల్గొన్నారు. హైదరాబాద్‌లో అత్యుత్తమ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రదర్శించే అద్భుతమైన ఈవెంట్‌ను నిర్వహించినందుకు క్రెడాయ్ బృందాన్ని శ్రీలీల అభినందించారు. నగరంలో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యంగా అభివృద్ధి చెందడాన్ని తెలియజేస్తూ షోలో పాల్గొన్న డెవలపర్‌లందరికీ ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. హైదరాబాద్ యొక్క వేగవంతమైన అభివృద్ధిపై తన అభిప్రాయాలను వ్యక్తపరిచిన శ్రీలీల, అభివృద్ధి చెందుతున్న ఈ నగరంలో సొంత ఇంటిని సొంతం చేసుకోవాలనే వారి కలను సాకారం చేసుకోవడానికి, సౌకర్యం, సౌలభ్యంతో కూడిన జీవితాన్ని ఆస్వాదించడానికి వ్యక్తులకు ఇది సరైన తరుణం అని ఉద్ఘాటించారు. కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో 2వ ప్రాపర్టీ షో ఆగస్ట్ 11, 2024 వరకు సందర్శకులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉందని అన్నారు. ఈ ప్రదర్శనలో అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, విల్లాలు, ప్లాట్లు మరియు వాణిజ్య స్థలాలు వంటి ప్రధాన ప్రాంతాల్లో ఉన్న అనేక రకాల ప్రాజెక్ట్‌లు ఉన్నాయయని నిర్వాహకుల తో కలిసి తెలిపారు. బాలానగర్, కొంపల్లి, శామీర్‌పేట్, మేడ్చల్, అల్వాల్, పటాన్‌చెరు ఈ ప్రాంతాలలో ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, రామన్నపేట:** అనారోగ్యాలకు గురైన నిరుపేదలు సీ.ఎం సహాయ నిధి సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ నియోజకవర్గం మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు మంజూరైన 21 లక్షల విలువైన సీ.ఎం సహాయ నిధి చెక్కులను వివిధ మండలాధ్యక్షులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ అనారోగ్యాలకు గురై ఆస్పత్రుల పాలైన నిరుపేదలకు సీ.ఎం సహాయ నిధి వరం లాంటిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ నిరుపేదల పక్షాన పనిచేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామ, మండల శాఖల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పాలమూరు అభివృద్ధి ప్రదాత జూపల్లి



**విశ్వంభర, హైద్రాబాద్ :** పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన అపర భగీరథుడు రాష్ట్ర ఎక్సైజ్ ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అన్నారు. బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలును పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బోరెల్లి సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా పచ్చబడడానికి, వలసలను అరికట్టి,అభివృద్ధి పథంలో ముందు కు దూసుకుపోవడానికి కారణం మంత్రి జూపల్లి కృష్ణారావు అని అన్నారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు వలిగొండ నరసింహ , తెలంగాణ పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మండ్ల రవి , ఓయూ జేఏసీ నాయకులు దేవరకొండ నరేష్, కల్వకుర్తి శ్రీశైలం , బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు భిక్షం , ఆరె కంటి శ్రీకాంత్, మధు, రేవంత్, చింటూ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా లక్పతి నాయక్



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలోని పోచమ్మ గడ్డ తండకు చెందిన గిరిజనుల ముద్దుబిడ్డ జర్పుల లక్పతి నాయక్ ని సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా శుక్రవారం హైదరాబాద్ ఎల్. బి. నగర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు, యువకులు జర్పుల లక్పతి నాయక్ ని కలిసి పూలు మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నాయకులు జర్పుల లక్ష్మణ్ నాయక్, జర్పుల టిక్లాల్ నాయక్, క్రాంతి నాయక్, ప్రశాంత్ నాయక్, గోపి నాయక్, నాయకులు, యువకులు పాల్గొన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్

**విశ్వంభర, బషీర్ బాగ్:** చార్మినార్ జోన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఐ. నెహ్రూ బాబు కుమారుడు నిహాల్, స్నేహ ల వివాహ రిసెప్షన్ లక్ష్మీనరసింహారెడ్డి గార్డెన్స్ చంపాపేట్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు, టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్ రాజ్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి వధూవరులను ఆశీర్వదించారు.

## బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల ప్రాణాలు విలువైనవి

### సింగరేణి సీఎండీ బలరాం



**విశ్వంభర, హైదరాబాద్:** బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల ప్రాణాలు విలువైనవని, రక్షణ లేని ఉత్పత్తి అవసరం లేదని సింగరేణి సీఎండీ బలరాం స్పష్టం చేశారు. రక్షణపై ఉన్న నియమ నిబంధనలను పాటిస్తూ అందరూ కలిసి సురక్షిత సింగరేణిని ఆవిష్కరించే లక్ష్యంతో పనిచేస్తూ ఉత్పత్తిని సాధించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణిలోని మొత్తం 40 గనులు, విభాగాలకు చెందిన రక్షణ కమిటీలు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు, మైన్స్ కమిటీ సభ్యులు, ఇతర రక్షణ సూపర్వైజర్లతో సీఎండీ బలరాం దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎప్పుడూ గనుల్లో మేనేజర్ల సమక్షంలోనే జరిగే ఈ సమావేశాన్ని సంస్థ సీఎండీ స్వయంగా నిర్వహించి నేరుగా సలహాలు సూచనలు స్వీకరించడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ అన్ని రంగాల్లో అత్యుత్తమ కంపెనీగా నిలిచినప్పటికీ ప్రమాదాల నివారణలో మాత్రం కొంత వెనకబడటం విచారకరమని, దీనికి కారణం ఎక్కువగా మానవ తప్పిదాలే అని సీఎండీ పేర్కొన్నారు. ప్రతి పనికి కొన్ని ఎస్.ఒ.పి (సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్) ఉన్నాయని, వీటిని సరిగా పట్టించుకోకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వీటిని పాటించాలని సూచించారు. కార్మికుల రక్షణ ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన ప్రత్యేక వైద్య నిపుణులను నియమిస్తున్నామని, రామగుండం ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా రూపుదిద్దుతున్నామన్నారు.



## తులం బంగారం దేవుడెరుగు..

### కేసీఆర్ ఇచ్చిన రూ.లక్ష కూడా ఎగ్గొట్టారు

### సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేత, కోతల ప్రభుత్వమని భీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పింఛన్ పెంపు, రైతుబంధు, తులం బంగారం.. మాటలకే పరిమితమైందని ఎద్దే చేశారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. పింఛన్ పెంపు దేవుడెరుగు, 2 నెలల నుంచి ఉన్న పింఛనే రావట్లేదని ఆరోపించారు."తులం బంగారం దేవుడెరుగు. కేసీఆర్ ఇచ్చిన రూ. లక్ష కూడా ఎగ్గొట్టారు. అబద్ధాలు, మాయ మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లలో పని చేసే కార్మికులకు జీతాల్లేవు. గ్రామాల్లో కుక్కలు, వసతి గృహాల్లో ఎలుకలు దాడి చేస్తున్నాయి" అని హరీశ్ రావు అన్నారు.

## రాష్ట్రంలో వీధికుక్కల దాడులు విపరీతంగా పెరిగాయి

### ప్రభుత్వం పట్టించుకోలేదని

### హరీష్‌రావు ఎక్స్ వేదికగా విమర్శలు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరుగుపోతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణమని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. ఎందరో పసికందుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. శుక్రవారం ఒక్కరోజే.. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పసికందు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతినడం, హైదరాబాద్ శివారులోని నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో మరో దివ్యాంగ చిన్నారి మర్మాంగాలపై కుక్కల దాడి ఘటనలు జరిగాయని హరీశ్ రావు తెలిపారు. యాంటీ రేబిస్ మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. వీధి కుక్కల నియంత్రణ కోసం సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని, క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ సంఖ్య పెరగకుండా చూసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## అనాధ పిల్లల ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ

**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం పాసిగడ్డ తాండ గ్రామానికి చెందిన భూక్య వసంత భర్త భూక్య సురేష్ ఇద్దరూ గత ఆరు సంవత్సరాల క్రితం పేదరికం వల్ల అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. అప్పటి నుండి వారి నలుగురు పిల్లలు అనాధలుగా మారారు. ఇటీవల వారి పాత ఇల్లు వర్షాల వల్ల కూలిపోవడంతో వారి పరిస్థితి గూడు చెదిరిన పక్షులాగా అయ్యింది. ఈ విషయం దిన పత్రికలలో రావడంతో వెంటనే స్పందించిన ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి వారి ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఆ అనాధ పిల్లలకు ఇల్లు కటిస్తానని భరోసా కల్పించారు. వారికి ఇల్లు కట్టించడానికి శనివారం భూమి పూజ చేసి ఇంటి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ చిట్యాల మండల ఇన్చార్జీ లౌడియ రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి బల్ల శ్రావణ్, యూత్ ఇన్చార్జీ చింతకింది రాజు, డైరెక్టర్ శీలం అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో రాజకీయ శిక్షణ తరగతులు

**విశ్వంభర, ఖమ్మం :** పట్టణంలోని సిపిఎం పార్టీ ఖానాపురం హవేలీ రామకృష్ణ భవన్ లో డివైఎఫ్ఐ జెండా ఎగరవేసి రాజకీయ శిక్షణ తరగతులును ఖమ్మం జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం హవేలీ సిపిఎం సెక్రటరీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మంలో ఫేక్ ఫుడ్ ఇన్ స్పెక్టర్ల హల్‌చల్

- గ్యాంగ్ సినిమా తరహాలో రైడ్
- పోలీసులకు ఫిర్యాదు.. అరెస్టు



**విశ్వంభర, ఖమ్మం:** ఆహార తనిఖీ అధికారులమంటూ ఖమ్మం నగరంలోని కింగ్ దర్బార్ హెూటల్ లో ఫేక్ ఫుడ్ ఇన్ స్పెక్టర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. కుళ్లిపోయిన మాంసం, కాలంచెల్లిన నిత్యావసర సరుకులు వినియోగిస్తున్నారంటూ హెూటల్ యజమానిపై ఫైర్ అయ్యారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని మండిపడ్డారు. ఫేక్ ఫుడ్ ఇన్ స్పెక్టర్ల అడావుడికి హెూటల్ యజమాని బెంబేలెత్తిపోయాడు. మీహెూటల్ నిర్వహణలో లోపాలు ఉన్నాయని హైదరాబాద్ నుంచి తమను ఆకస్మిక విచారణ చేయమని చెప్పిన కేటుగాళ్లు. విచారణ నివేదిక అనుకూలంగా ఇవ్వాలంటే రెండులక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ సీసీ, జిల్లా ఫుడ్ ఇన్ స్పెక్టర్ కు తలా యాభైవేలు ఇవ్వాల్సి ఉంటుందన్న ఫేక్ ఫుడ్ ఇన్ స్పెక్టర్లు వివరించాడు. అనుమానం వచ్చిన హెూటల్ యజమాని స్థానిక ఫుడ్ ఇన్ స్పెక్టర్ కు ఫోన్ కాల్ ద్వారా సమాచారం అందించాడు. తమ శాఖ నుంచి జిల్లాలో ఆకస్మిక తనిఖీలు ఏమీ లేవని జిల్లా స్థాయి ఆహార తనిఖీ అధికారి కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. కేటుగాళ్లను గుర్తించిన హెూటల్ యజమాని జుబేర్ ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందిన సమాచారంతో రంగంలోకి దిగిన ఖమ్మం అర్బన్ పోలీసులు నలుగురు కేటుగాళ్లను అరెస్ట్ చేశారు. అరెస్టయిన నిందితులు గతంలోనూ ఇలాంటి దాడులకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పట్టుబడిన నిందితులు భద్రాద్రికొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన గుగులోత్ మోహన్ రావ్, బానోత్ రామస్వామి, సపావత్ యువరాజ్, అజ్మీరా యువరాజ్ సింగ్ గా పోలీసులు గుర్తించారు.



## నార్కోటిక్ జాగిలంతో జిల్లా కేంద్రంలో తనిఖీలు

**విశ్వంభర, కరీంనగర్:** కరీంనగర్ పోలీసు కమిషనరేట్ లో నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడానికి కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు శనివారం బస్టాండ్ లోని పార్సిల్ ఆఫీసు, కిరాణా షాపులు, పాన్ షాప్, హాస్టల్స్, అనుమానిత ఇండ్లలో పోలీస్ తనిఖీలు నిర్వహించారని కరీంనగర్ టౌన్ డివిజన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. ఈ తనిఖీలలో కరీంనగర్ వన్ టౌన్ సీఐ సరిలాల్ సిబ్బందితో పాటు నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసు జాగిలం (లియో) తో డాగ్ హాండ్లర్ కానిస్టేబుల్ ఏ శంకర్ కలిసి బస్టాండ్, పలు పార్సెల్ ఆఫీసులు, కిరణా షాపుల్లో, పాన్ షాప్ కొన్ని అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఎవరైనా వ్యక్తుల వద్ద, పాన్ షాప్ లలో కిరాణా షాపుల్లో మరే ఇతర షాపుల్లో ప్రభుత్వం నిషేధించిన గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా లేక విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు తమవంతు భాద్యతగా వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకి తెలియజేయాలన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఈ తనిఖీలు ఇక మీదట నిరంతరం కొనసాగుతాయని పట్టుబడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బీసీ(సీ) లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు కృషి చేయాలి

**విశ్వంభర, బషీర్ బాగ్:** ఎస్సీ క్రైస్తవులను బీసీ(సీ) లోకి చేరమని చెబుతున్న క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయిస్తారా అని అణగారిన క్రైస్తవ జన సమాఖ్య వ్యవస్థాపక జాతీయ కన్వీనర్ నాగాల్ల పోచయ్య ఇశ్రాయేల్ డిమండ్ చేశారు. ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్, ప్రత్యేక కమీషన్, ప్రత్యేక నియోజక వర్గాలు కల్పించినపుడే బీసీ(సీ) లకు న్యాయం జరుగుతుందని అన్నారు. క్రిస్టియన్ ఫైనాన్స్ చైర్మన్ హెూదాలో వీటిని సాధించగలరా అని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ క్రైస్తవులు బీసీ(సీ) లోకి మారడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన అన్నారు. విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించినప్పుడే ఎస్సీ క్రైస్తవులు బీసీ(సీ) లోకి వచ్చే అవకాశం ఉందని అన్నారు.

## డాక్టరేట్ అందుకున్న మంద సంజీవరెడ్డి



**విశ్వంభర, మేడిపల్లి:** ప్రజాసేవలో అలుపెరుగని సేవలు అందించారని మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీఎస్ యూనివర్సిటీ నుంచి శనివారం డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చినందుకు పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీఎస్ యూనివర్సిటీకీ ధన్యవాదాలు తెలిపారు. ఇలాగే ప్రజలకు ఎల్లప్పుడూ ప్రజాసేవను నిరంతరాయంగా అందిస్తానని, ఈ డాక్టరేట్ తనకు మరింత బాధ్యతను పెంచిందని అన్నారు.

## ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలి



**విశ్వంభర, కడ్తాల్:** ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్పల్లి సమీపంలోని మొదటి శ్రావణ శనివారం సందర్భంగా శ్రీ పరమేశ్వర వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య మాజీ సర్పంచ్ శంకర్, క్యాతిగ పర్వతాలు, రవికుమార్, మంగళపల్లి నరసింహ, రాజు గౌడ్, నరసింహా గౌడ్, కృష్ణయ్య రామకృష్ణ, నరేష్, గోపియా జంగయ్య, శీను పాల్గొన్నారు.

## ఖమ్మం కలెక్టరేట్ ముందు ధర్నా




**విశ్వంభర, ఖమ్మం :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా కల్పించాలని, ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కతోలిక్ బిషప్ సగిలి ప్రకాష్, ముఖ్య నాయకులు ముత్తమాల ప్రసాద్, కే.ప్రసాద్, పల్లా రాజశేఖర్ పాల్గొన్నారు రాజ్యాంగంలో మత స్వాతంత్రపు హక్కులను కలిగి ఉన్నాము కాబట్టి దళిత క్రైస్తవులకు ఎస్సి హెూదా కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బంగ్లాదేశ్ అల్లర్లను ఖండించిన హిందూ సంఘాలు



**విశ్వంభర, కోరుట్ల:** బంగ్లాదేశ్ లో గత వారం రోజులుగా జరుగుతున్న అల్లర్లలో అక్కడి మైనార్టీలు అయినా అమాయక హిందువు యువకులను, పసిపిల్లలను, వృద్ధులను చంపుతూ హిందూ మందిరాలను, హిందువుల ఆస్తులను, దోచుకుని తగలబెడుతూ హిందూ బాలికలను, మహిళలను సామూహికంగా బలాత్కారాలు చేసి చంపుతున్న బంగ్లాదేశ్ నరరూప రాక్షస అరాచకాలను ఖండిస్తూ కోరుట్ల పట్టణ హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాలు, హిందూ గణపతి మండపాల యూత్ సభ్యులు, మాడవేణి నరేష్ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ పాల్గొని బంగ్లాదేశ్ మైనారిటీ హిందువులకు మనోధైర్యాన్ని

## అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపలి మండల కేంద్రం నుండి మిడ్జిల్ రహదారిలో పది సంవత్సరాలకు పైగా రోడ్డు పనులు నత్త నడకన నడవడం జరుగుతుందని బ్రిడ్జిలు నిర్మాణం జరిగక నిత్యం అనేక గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీజేవైఎం అసెంబ్లీ ఇన్చార్జి పద్మ అనిల్ అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో అసంపూర్తిగా నిర్మాణం జరిగిన వంతెన వద్ద నిరసన తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ వందలాది వాహనాలు ప్రయాణం చేసే రహదారి పలు మార్లు బైక్ లు కిందపడి ప్రమాదాలు జరిగాయని, ఈ రహదారిలో తిరిగే కార్లు బస్సులు మరమ్మత్తులకు గురవుతున్నాయని అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించి, వినతి పత్రాలు ఇచ్చినా పనులు పూర్తి చేయడంలో విఫలమయ్యారని ప్రయాణికులు భాధను తీర్చాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చోరువ తీసుకొని అతి త్వరలో రోడ్డు, బ్రిడ్జి పనులు చేపట్టక పోతే బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరిచారు.

## దళిత క్రైస్తవులకు స్వేచ్ఛ ఎస్సీ హెూదా బిల్లు పార్లమెంటులో పెట్టాలి




**విశ్వంభర, బషీర్ బాగ్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ దళిత క్రైస్తవులకు స్వేచ్ఛ ఎస్సీ హెూదా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని భారత క్రిస్టియన్ కౌన్సిల్, బిషప్ భాస్కర్ ముల్కల, క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, ఆండ్రూ జేవియర్, క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ జెరుషలేము మత్తయ్య, ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్, ప్రెసిడెంట్ చావల జోసెఫ్ లు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం అనంతరం ఉన్న దళిత క్రైస్తవుల ఎస్సీ హెూదాను, 1950, సంవత్సరం ఆగస్టు 10న రాష్ట్రపతి ఆర్డర్ తో తొలిగించి క్రైస్తవ మత స్వేచ్ఛను హరించారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో సరైన మెజారిటీ ఉండి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగల కాంగ్రెస్ పార్టీ తక్షణమే ఎస్సీ హెూదా అంశాన్ని రాబోయే శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

## తాళం వేయడం మరిచారా.. మీ బైకులు గోవిందా




**విశ్వంభర, మెట్‌పల్లి:** నిజామాబాద్ జిల్లా ఎరుగట్ల మండలం గుమ్మిర్యాల గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్ పోశెట్టి గతంలో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేసే క్రమంలో కాలు విరగడంతో మద్యానికి బానిసై జల్సాల కొరకు దొంగతనాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలో జగిత్యాల జిల్లాలో 13 బైకులు, నిజామాబాద్ జిల్లాలో 7 బైకుల దొంగతనానికి పాల్పడి నిర్మల్ జిల్లా మామల మండలం పొంగల్ గ్రామానికి చెందిన మోసిన్, అబ్దుల్ రషీద్ బైక్ మెకానిక్ షాప్ నిర్వాహకులకు రూ. 8,000ల నుండి రూ. 10,000ల రూపాయలకు ఒక్కొక్క వాహనాన్ని లమ్మేవాడు వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. ద్విచక్ర వాహనాల దొంగతనం ఫిర్యాదులు అత్యధికంగా రావడంతో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐ నిరంజన్ రెడ్డి ఎస్ఐ చిరంజీవి మెట్పల్లి శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగతనం చేసిన ద్విచక్ర వాహనంపై వస్తున్న మన్నె లక్ష్మణ్ ను విచారించి దొంగతనానికి పాల్పడిన 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తును కొని విక్రయించిన మహమ్మద్ మోసిన్ 2, అబ్దుల్ రషీద్ 2 లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అందుబాటులో ఉన్న అత్యాధునిక టెక్నాలజీని వాడి ద్విచక్ర వాహన దొంగలను అరెస్టు చేసిన మెట్ పల్లి పోలీసు సిబ్బంది అశోక్ కుమార్ ను అభినందించారు.




## తోటి విద్యార్థికి ఆర్థిక సాయం

**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ ఎదులాబాద్ 2000-01, 10 వ తరగతి బ్యాచ్ కు చెందిన పూస నగేష్ ఆకాల మరణం చెందాడు. పూస నగేష్ బ్యాచుకు చెందిన తోటి విద్యార్థులు కలిసి రూ. 73,100 ల ఆర్థిక సహాయాన్ని శనివారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మొత్తాన్ని నగేష్ కుమారుడు పేరున పిక్స్డ్ డిపాజిట్ చేశారు.



## భూకబ్జాదారుల నుండి మాకు రక్షణ కల్పించండి

**విశ్వంభర, గ్రేటర్ వరంగల్ :** 15 వ డివిజన్ గొర్రెకుంట కోటిలింగాల గుడి సమీపంలోని వెంకటేశ్వర కాలనీ లోని సంఘం అధ్యక్షుడు కాశెట్టి వీరస్వామి మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరాల క్రితం 70 మంది భూభాదితులు సర్వే నంబర్ 132/లో 5 ఎకరాల 10 గుంటల భూమిని కొనుగోలు చేసి ఇంటి నిర్మాణాలు,ప్రహరీ గోడల నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. నీలారపు రంజిత్ అనే వ్యక్తి తన భూమి కాకున్నా అర్ధరాత్రి సమయంలో తన అనుచరులతో అక్కడకు చేరుకుని మహిళలపై దాడి చేసి సెల్ ఫోన్లను లాక్కుని సీసీ కెమెరాల హార్డ్ డిస్కును లాక్కెల్లి, ఇంటి నిర్మాణాలను కూల్చివేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్ జిల్లా కలెక్టర్, పరకాల ఎమ్మెల్యే, గీసుకొండ పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ భూభాదితులు చంద్రమౌళి, గంగాధర్, నరేష్, రాజు, సత్యనారాయణ, ప్రదీప్, వేణు, రఘుపతి, గఫుద్ అలీ, యాదగిరి, వేణు, విష్ణు, నవీన్, ఖాజా మోహినుద్దీన్, సూర్య నారాయణ, సాంబశివచారి, ఉదయ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో హెరాయిన్

**విశ్వంభర, ఖమ్మం :** తెలంగాణ యాంటి నార్కోటిక్ పోలీసుల ఆపరేషన్ భారీ ఆపరేషన్ చేపట్టారు. డార్క్ వెబ్ ద్వారా డ్రగ్స్ ను ఆర్డర్ చేస్తున్న కన్స్యూమర్లను పోలీసుల పట్టుకున్నారు . నార్కోటిక్ టెక్నికల్ వింగ్ ఇచ్చిన సమాచారంతో ఖమ్మం పోలీసులు ఆపరేషన్ చేపట్టగా డ్రగ్స్ కు బానిసగా మారిన ఖమ్మం జిల్లాకు చెందిన ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ జూలై 31న డార్క్ వెబ్ ద్వారా డ్రగ్స్ ఆర్డర్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ కోసం క్రిప్టో కరెన్సీ ద్వారా చెల్లింపులు సాఫ్ట్ వేర్ ఇంజనీర్ నగదు చెల్లింపులు చేసినట్టు గుర్తించారు. అస్సాం నుండి స్పీడ్ పోస్టులో డ్రగ్స్ డెలివరీ అయినట్టు నిర్ధారించారు. న్యూస్ పేపర్ లో డ్రగ్స్ చుట్టి ప్లాస్టర్ అంటించి సరఫరా చేశారని తెలిపారు. ఆగస్ట్ 8న డ్రగ్స్ డెలివరీ తీసుకుంటుండగా ఖమ్మం పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.



# భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు

**ఇద్దరు సైనికులకు గాయాలు**

**అనంతనాగ్:** జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా అహ్లాన్ గడోల్ ప్రాంతంలో శనివారం భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. కోకెర్‌నాగ్ ప్రాంతంలో ఉన్న అహ్లాన్ గడోల్‌లో ఉగ్రవాద జాడ గురించి పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ క్రమంలో భద్రతా బలగాలు సంఘటనా స్థలానికి చేరుకొని సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను పసిగట్టిన ఉగ్రవాదులు భద్రతా సిబ్బందిపైకి కాల్పులు జరిపారు. భద్రతా బలగాలు సైతం దాడులను తిప్పికొడుతున్నాయి. సంఘటనా స్థలంలో ఇద్దరు ఉగ్రవాదులు దాక్కున్నట్లుగా సమాచారం. పారిపోకుండా భద్రతా బలగాలు వారిని దిగ్బంధించాయి. అయితే, ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు సైనికులకు గాయాలైనట్లు సమాచారం. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు జరుగుతున్నాయని జమ్మూ కశ్మీర్ పోలీసులు తెలిపారు. మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ఇటీవల అనంత్‌నాగ్‌లో భక్తులపై ఉగ్రవాదులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందగా.. 40 మంది వరకు గాయపడ్డారు. 2021 నుంచి జమ్మూ ప్రాంతంలో జరిగిన ఉగ్రవాద ఘటనలో 52 మంది భద్రతా సిబ్బంది సహా 70 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదులు సరిహద్దుల నుంచి భారత్‌లోకి చొరబడేందుకు నిత్యం ప్రయత్నిస్తున్నారు. వారి ప్రయత్నాలను భద్రతా బలగాలు తిప్పికొడుతున్నాయి. భారత్‌లో చొరబడేందుకు ఉగ్రవాదులకు పాక్ ఆర్మీ, ఐఎస్ఐ సహకారం అందిస్తున్నాయి.

# బంగ్లాదేశ్ బ్యాంక్ గవర్నర్ అబ్దుర్ రౌఫ్ రాజీనామా


**ఢాకా:** బంగ్లాదేశ్ బ్యాంక్ గవర్నర్ అబ్దుర్ రౌఫ్ తాలూక్దార్ రాజీనామా చేశారు. దేశంలో సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. నిరసనకారులు ఇటీవల కేంద్ర బ్యాంక్‌కు చెందిన ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. బంగ్లా బ్యాంక్ గవర్నర్ శుక్రవారం తప్పుకున్నారు. వ్యక్తిగత కారణాల వల్ల వైదొలుగుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయనకు ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నది. ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి దేశం విడిచి వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె ప్రస్తుతం ఇండియాలో తలదాచుకుంటున్నారు. అయితే ఘటన నేపథ్యంలో ఆందోళనకారులు ఢాకాలో ఉన్న బంగ్లాదేశ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలోకి చొరబడ్డారు. అధికారులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అబ్దుల్ రౌఫ్ 2022 జూలైలో బంగ్లా బ్యాంక్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయంలో దేశంలో తీవ్ర కరెన్సీ పతనం, అధిక ద్రవ్యోల్బణ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే మార్కెట్ల




వడ్డీ రేట్లలో సరళతరమైన మార్పులకు ఆయన శ్రీకారం చుట్టారు. కానీ బ్యాంకింగ్ రంగంలో రుణాల డిఫాల్ట్ కేసులు ఆ సమయంలోనే పెరిగినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. కరోనా మహమ్మారి తర్వాత బంగ్లాదేశ్ ఆర్థికంగా కోలుకోలేకపోయింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి గత ఏడాది 4.7 బిలియన్ల రుణాన్ని తీసుకున్నది.

# ఈ బామ్మ నుంచి తీసుకున్న స్ఫూర్తి జీవితాంతం మనకు ప్రేరణ

• వావ్.. 99 ఏళ్ల వయసులోనూ ఈత.. • ఆనంద్ మహీంద్రా ఆసక్తికర ట్వీట్!



**ఢిల్లీ:** ఎన్నో ఆసక్తికర విషయాలు, ప్రేరణ కలిగించే వీడియోలను తన 'ఎక్స్' ఖాతా ద్వారా పంచుకుంటుంటారు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా. తాజాగా ఆయన ఓ 99 ఏళ్ల స్విమ్మర్ వీడియోను షేర్ చేస్తూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బెట్టీ బ్రస్సెల్ (99) తాజాగా ఈత పోటీల్లో పాల్గొని రికార్డు సృష్టించిన వీడియోను ఆనంద్ మహీంద్రా పోస్ట్ చేస్తూ "పారిస్లో జరుగుతున్న ఒలింపిక్స్లో యువ క్రీడాకారుల ప్రతిభను చూసి స్ఫూర్తి పొందాము. ఇప్పుడు ఈ బామ్మ నుంచి తీసుకున్న స్ఫూర్తి జీవితాంతం మనకు ప్రేరణను కలిగిస్తోంది. అంటూ ప్రశంసలు కురిపించారు. దీంతో నెటిజన్లు ఆమె ఆత్మవిశ్వాసాన్ని కొనియాడుతున్నారు. 1924లో బెట్టీ బ్రస్సెల్ హాలండ్లో జన్మించింది. తన తోబుట్టువులతో కలిసి చిన్ననాటి నుంచి ఈతలో శిక్షణ తీసుకుంది. తన అరవై ఏళ్ల వయసులో బ్రిటిష్ కొలంబియా సీనియర్ గేమ్స్ లో పాల్గొంది. కాగా ఒలింపిక్స్ ప్రారంభం అయిన మొదటి నుంచి ఆనంద్ మహీంద్రా భారత క్రీడాకారులను పోత్సాహిస్తూ పలు పోస్టు చేస్తున్నారు. పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా రజత పతకం సాధించినందుకు ప్రశంసించారు. స్టార్ రెజ్లర్ వినేశ్ పొగాట్పై అనర్హత వేటు పడినప్పుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అది పీడకల అయితే బాగుండు అంటూ ఆవేదన చెందారు. ఆమె దేశం గర్వపడేలా చేసిందని, భారత్ మొత్తం తన వెన్నంటి ఉంటుందని ధైర్యం చెప్పారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు

• పలు చోట్ల విరిగిపడ్డ కొండచరియలు
• 128 రోడ్లను మూసివేసిన అధికారులు



**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌ను మరోసారి భారీ వర్షాలు ముంచెత్తాయి. ఈ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. శుక్రవారం సాయంత్రం నుంచి రాష్ట్రంలోని నహాన్‌లో అత్యధికంగా 168.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత సంధోల్‌లో 106.4మి,మీ, నగ్రోటా సూరియన్‌లో 93.2 మి.మీ, ధౌలకువాన్‌లో 67 మి.మీ, జుబ్బర్‌హట్టిలో 53.2 మి.మీ, కందఘహట్టిలో 45.6 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇక ఈ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో ముందు జాగ్రత్తగా సుమారు 128 రోడ్లను అధికారులు మూసివేశారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక ఆగస్టు 16 వరకూ భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మండి, సిర్మౌర్, సిమ్లా, కులు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వరదలకు పంట పొలాలు, పలు నిర్మాణాలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపింది. వాతావరణ కేంద్ర హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, నదులు, వాగులు, కొండ ప్రదేశాలకు వెళ్లొద్దని సూచించింది. కాగా, జూన్ 27 నుంచి ఆగస్టు 9 మధ్య కురిసిన వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 మందికిపైగా మరణించారు. అదేవిధంగా రూ. 842 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

# జగన్ పాలనలో నీటి పారుదల ప్రాజెక్టులు నిర్వీర్యం

• సోమశిల పట్టించుకోలేదు కాబట్టే వైసీపీకి రాజీనామా చేశా
• మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి



**విశ్వంభర, అమరావతి :** ఏపీలో వైసీపీ ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టులను పట్టించుకోక నిర్వీర్యం చేసిందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా సోమశిల ప్రాజెక్టు గురించి నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విన్నవించినా నిర్లక్ష్యం చేసినందుకు తాను వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరానని స్పష్టం చేశారు. శనివారం నెల్లూరు జడ్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో చాలా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని, ఎమ్మెల్యేలతో కలసి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ముందుకు వస్తే, ఆ పనులను పూర్తి చేయడానికి ఎన్డీఏ కూటమి సిద్ధంగా ఉందని వివరించారు. సోమశిలకు వరద వచ్చి సోమేశ్వర ఆలయం కొట్టుకుపోతే, జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. సోమశిల ప్రాజెక్ట్ హైలెవల్ కెనాల్ పనులను ఎందుకు నిలిపివేసిందో తెలుపాలని డిమాండ్ చేశారు . పోలవరాన్ని త్వరలో పూర్తి చేసి ఏపీని సస్యశ్యామలం చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థలకు ఇంకా రెండున్నారేళ్లు సమయం ఉందని, రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తామని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. పెన్షన్ల పంపిణీ వాలంటరీ వ్యవస్థ ఉంటేనే సాధ్యమవుతుందని జగన్ ప్రభుత్వంలో చెప్పారని, కూటమి ప్రభుత్వం వలంటరీ వ్యవస్థతో పనిలేకుండానే ఫించన్లు పంపిణీ చేస్తుందని స్పష్టం చేశారు.

# ప్రకాశం జిల్లాలో విషాదం

**ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి**

**విశ్వంభర, ప్రకాశం :** ఇసుక తవ్వకాలతో ఏర్పడ్డ గుంతల లోతు తెలియక ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన విషాద ఘటన ప్రకాశం జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని పామూరు మండలం డివి పాలెం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు గౌతమ్, చరణ్ చదువుతున్న పాఠశాలకు రెండు రోజులు సెలవులు రావడతో ఇద్దరు సమీపంలోని వాగులో స్నానానికి వెళ్లారు. వాగులో ఇసుక రవాణా చేయడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు నిండిపోవడం, అక్కడ లోతు ఉండడాన్ని గమనించక స్నానానికి వాగులో దిగారు. ఈత రాని ఇద్దరు విద్యార్థులు గుంతలో పడి దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఆలస్యమైనా నిజాయితీ, సత్యమే గెలిచాయి

• తనకు న్యాయం జరుగుతుందని భావించా
• హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మనీశ్ సిసోడియా



**ఢిల్లీ:** ఆలస్యంగానైనా నిజాయితీ, సత్యమే గెలిచాయని ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్టయ్యి 570 రోజులకు పైగా జైల్లో ఉన్న మనీశ్‌సిసోడియాకు బెయిల్ లభించడంతో.. శుక్రవారం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. శనివారం ఉదయాన్నే కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మనీశ్‌సిసోడియాతోపాటు పలువురు ఆప్ నేతలు కూడా ఉన్నారు. సిసోడియా మాట్లాడుతూ.. భజరంగ్ బలి ఆశీర్వాదంతోనే తాను జైలు నుంచి బయటకు వచ్చానని చెప్పారు. త్వరలో సీఎం కేజ్రీవాల్ కూడా భజరంగ్ ఆశీర్వాదంతో జైలు నుంచి విడుదలవుతారని అన్నారు. ఆ తర్వాత సిసోడియా సహా ఆప్ నేతలంతా మహాత్మాగాంధీ స్మారకమైన రాజ్‌ఘాట్‌కు వెళ్లి గాంధీజీకి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిసోడియా మాట్లాడుతూ.. ఆలస్యమైనా ఆఖరికి నిజాయితీ, సత్యమే గెలిచాయని వ్యాఖ్యానించారు. ఈ కష్టకాలం తనకు మానసికంగా మరింత బలాన్నిచ్చిందని సిసోడియా చెప్పారు. ఓ ఏడెనిమిది నెలల్లో తనకు న్యాయం జరుగుతుందని భావించానని, కానీ 17 నెలల కాలం పట్టిందని అన్నారు. ఆలస్యమైన సత్యమే గెలువడం సంతోషకరమని చెప్పారు. రాజ్‌ఘాట్‌లో ఏర్పాటు చేసిన సభలో సిసోడియా ప్రసంగిస్తూ.. ఆలస్యమైనా ఆఖరికి నిజాయితీ, సత్యమే గెలిచాయని వ్యాఖ్యానించారు. ఈ కష్టకాలం తనకు మానసికంగా మరింత బలాన్నిచ్చిందని సిసోడియా చెప్పారు. ఓ ఏడెనిమిది నెలల్లో తనకు న్యాయం జరుగుతుందని భావించానని, కానీ 17 నెలల కాలం పట్టిందని అన్నారు. ఆలస్యమైన సత్యమే గెలువడం సంతోషకరమని చెప్పారు. బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై ప్రతిపక్ష కూటమి ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందని సిసోడియా అన్నారు. ఇవాళ జైల్లో ఉన్నది ఆప్ కార్యకర్తలు, నేతలేగదా మనకెందుకు అనుకుంటే.. రేపు మీ వంతు కూడా రావచ్చని వ్యాఖ్యానించారు. అందరం ఒక్కతాటిపైకి వచ్చి పోరాడితే నియంతృత్వం అంతమవుతుందని, కేజ్రీవాల్ కేవలం 24 గంటల్లోనే జైలు నుంచి బయటికి వస్తాడని అన్నారు.



# కేంద్ర క్యాబినెట్ సెక్రటరీగా సోమనాథన్ నియామకం

**1987 బ్యాచ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి**

**ఢిల్లీ:** కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ (ఏసీసీ) శనివారం నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 30 నుంచి రెండేండ్ల పాటు స్వామినాథన్.. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా ఉంటారు. 1987 బ్యాచ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన టీవీ సోమనాథన్ ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. క్యాబినెట్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టే వకూ క్యాబినెట్ సెక్రటేరియట్‌లో 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)'గా విధులు నిర్వర్తిస్తారని కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. కేంద్ర ఆర్థికశాఖలో 2019 నుంచి వ్యయ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్న టీవీ సోమనాథన్.. 2021లో ఆర్థికశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. నాటి నుంచి బడ్జెట్ తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాల డిమాండ్లలో సమతుల్యత పాటిస్తూనే బడ్జెట్‌లో ఆర్థిక క్రమశిక్షణకు పెద్ద పీట వేశారు. 1987 బ్యాచ్ తమిళనాడు క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన సోమనాథన్ 2015 ఏప్రిల్ నుంచి 2017 ఆగస్టు వరకూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో పని చేశారు. గతంలో కార్పొరేట్ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శిగా, ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ గానూ పని చేశారు.



# భారీగా గంజాయి స్వాధీనం.. 5గురు అరెస్ట్

**విశ్వంభర, అమరావతి :** ఏపీలోని గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుండటంతో పోలీసులు పలుచోట్ల విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మంగళగిరి కాజి టోల్‌గేట్ వద్ద ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రెండు కార్లలో అనుమానం ఉన్న వ్యక్తులను గమనించి కార్లను తనిఖీ చేయగా అందులో ఉన్న 230 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న అమీర్, అబ్దుల్లా ఫారుఖ్, కార్తికేయన్, మల్లికార్జున్, కాలేయ్ మృధన్ అనే ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 34 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు గుంటూరు పోలీసులు వెల్లడించారు.



# నవ్వుతూ బతకాలిరా!

నవ్వు నాలుగు విధాలా మంచిదంటారు. అంతేకాదు ఒత్తిడి నుంచి బయటపడేసే ఖర్చులేని ఔషధం కూడా. అయితే ఎడతెరిపి లేని పని, తీరిక దొరకని జీవనశైలి వల్ల చాలామంది రోజుకు సగటున 18 సార్లే నవ్వుతున్నారని తాజాగా ఒక అధ్యయనం చెబుతోంది. అది కూడా ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు, వాళ్లకు జాలీగా అనిపించినప్పుడు మాత్రమే నవ్వుతున్నారట. ఇదంతా ఎందుకు చెబుతున్నారంటే.. రోజులో ఎక్కువ సార్లు నవ్వుతూ ఉండేవారు ఒత్తిడిని తేలిగ్గా జయిస్తారంటున్నారు స్విట్జర్లాండ్ బసెల్ విశ్వవిద్యాలయం పరిశోధకులు.

రోజులో ఎన్నిసార్లు నవ్వుతారనేది వారి వయస్సు, లింగం, ఆ రోజు వారికి ఎదురయ్యే పరిస్థితులు, అనుభవాల మీద ఆధారపడి ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇంకో విశేషమేమంటే... పురుషుల కన్నా మహిళలు సగటున రోజులో ఎక్కువ సార్లు నవ్వుతారట. బసెల్ యూనివర్సిటీలోని సైకాలజీ విభాగానికి చెందిన 'క్లినికల్ సైకాలజీ అండ్ ఎపిడెమియోలజీ' పరిశోధకులు ఇటీవల జరిపిన పరిశోధనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఒత్తిడిని జయించడంలో నవ్వు పాత్ర మీద వారు ఈ అధ్యయనం చేశారు.


## ఎనిమిది ప్రశ్నలు... 14 రోజులు...

పరిశోధకులు తమ అధ్యయానికి 22ఏళ్ల లోపు వయసున్న 41మంది సైకాలజీ విద్యార్థులను ఎంచుకున్నారు. వీరిలో 33 మంది అమ్మాయిలు ఉన్నారు. వీరికి మొబైల్ యాప్ ద్వారా కొన్ని ధ్వని సంకేతాలను పంపారు. వాటిని విని వీరంతా రోజుకు ఎనిమిది ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు. అలా 14 రోజులు వారిని నిశితంగా పరిశీలించారు. ఎంత బిగ్గరగా నవ్వారు, ఎన్ని సార్లు నవ్వారు, నవ్వడానికి కారణం, చివరి సంకేతం వచ్చేనాటికి ఒత్తిడి తాలూకు లక్షణాలు, ఒత్తిడి పెంచే సంఘటనలు ఏవైనా జరిగాయా వంటివి ఆరా తీశారు. నవ్వు, ఒత్తిడికి సంబంధించిన అంశాలు, దాని తాలూకు మానసిక, శారీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ పరిశోధనకు డాక్టర్ జాండెర్ షెలెన్‌బర్గ్, డాక్టర్ ఇసబెల్లా కొలిన్స్ సారథ్యం వహించారు.

## ఎలా నవ్వారనేది కాదు...

మొదటి ఫలితంలో ఎక్కువగా నవ్విన వారిలో ఒత్తిడికి కారణమయ్యే విషయాలు, ఒత్తిడి లక్షణాలు చాలా తక్కువ కనిపించాయని తేలింది. రెండో ఫలితంలో ఎలా నవ్వారు (బిగ్గరగా, చిన్నగా, ముక్తసరిగా నవ్వడం) అనేది ఒత్తిడి మీద ప్రభావం చూపలేదు. అందుకు కారణం వాళ్లంతా ఎన్నిసార్లు నవ్వామనే దాని మీదే దృష్టి పెట్టారు. అంతేతప్ప ఎలా నవ్వాము అనే దానిమీద కాదని పరిశోధకులు చెప్పారు.

ప్రపంచ జనాభాలో 4 శాతం మంది ఎడమ చేతి వాటం కలవారని అధ్యాయనాలు చెబుతున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన రీసెర్చ్ ప్రకారం కుడి, ఎడమ చేతి అలవాట్లను డిసైడ్ చేసేది మెదడులో ఉండే సైటో స్కెలిటన్ అనే పదార్థమని గుర్తించారు. ఎడమచేతి వాటం ఉన్నవారు ఇతరులకంటే తెలివిగా ఉంటారని, వీరిలో సృజన ఎక్కువగా ఉంటుందని కూడా అంటారు. నిజానికి ఎడమ చేతి వాటం సామర్థ్యం తెలిస్తే మాకెందుకు రాలేదని చాలా మంది భావిస్తారు. ఎందుకంటే వాళ్లు చాలా స్మార్ట్ గా ఉంటారు. చూడ్డానికే కాదు.. ఇంటెలిజెన్స్‌నూ స్మార్టే. కుడి చేతి అలవాటున్నోళ్లకంటే.. ఎడమచేతి అలవాటు ఉన్నోళ్లు చాలా షార్పా ఉంటారు. వీళ్లు ఏ విషయాన్నైనా వెంటనే అర్థం చేసుకుంటారు. ఎడమ చేతి వాటం వాళ్లు ఏది చేసినా కొత్తగా ఉండాలని కోరుకుంటారు. వీరికి మెమరీ పవర్ కూడా ఎక్కువ. వీళ్లకు ఒకేసారి రెండు మూడు పనులు చేసే కెపాసిటీ కూడా ఉంటుంది. ఎడమచేతి అలవాటు ఉన్నోళ్లే ఎక్కువగా వ్యోమగాములుగా రాణిస్తారు. 25 శాతం మంది వ్యోమగాములు లెఫ్ట్ హ్యాండర్స్. అందుకే లెఫ్ట్ హ్యాండెడ్ వాళ్ల కోసం ' ఇంటర్నేషనల్ లెఫ్ట్ హ్యాండర్స్ డే'ని ప్రతి యేటా ఆగస్ట్ 13న సెలబ్రేట్ చేస్తారు.



# ఎడమంటే పెడమొహం దేనికి?

భారత పితా మహాత్మాగాంధి ఎడమ చేతి వాటం అన్న విషయం తెలుసా! అదే విధంగా క్రికెట్ ప్రపంచ దేవుడిగా ఆరాదించే సచిన్ టెండుల్కర్ కుడిచేతితో బ్యాటింగ్ చేసినా... స్వతహాగా ఎడమచేతి వాటం అన్న విషయం చాలా మందికి తెలియదు. అమెరికా 44వ అధ్యక్షుడు ఒబామాది కూడా ఎడమ చేతి వాటమే. ఎడమచేతి వాటం ఉన్న ప్రసిద్ధుల గురించి చెప్పుకోవడం మొదలుపెడితే... ఆ జాబితా చాలా పెద్దదిగానే ఉంటుంది. మన నాగరికత అంతా కుడిచేతి వాటానికి అనుకూలంగా కనిపిస్తుంది. కారు దగ్గర నుంచీ కత్తెర దాకా ప్రపంచం అంతా కుడిచేతివారికే అనుకూలంగా ఉంటుంది. ఎడమచేతి వాటం ఉన్నవారిని పరిశుభ్రత లేనివారుగానూ, వింతమనుషులుగానూ భావించడమూ కనిపిస్తుంది. ఇప్పుడంటే ఫర్వాలేదు కానీ.... ఒకప్పుడు ఎడమచేతివారిని మంత్రగాళ్లుగా, సైతానుకి ప్రతిరూపాలుగా భావించేవారు. అలా ఎడమచేతి వాటం ఉన్నవారిని తగలబెట్టిన సందర్భాలు కూడా చరిత్రలో ఉన్నాయని అంటారు. 'చాలా సంస్కృతుల్లో ఎడం చేతి అలవాటున్న వారిని కాస్త హీనంగా చూస్తారు. వారిని దురదృష్టవంతులుగా భావిస్తారు. ఆ వివక్ష ఆనవాళ్లు భాషలోనూ కనిపిస్తుంటాయి" అని శస్త్ర చికిత్స నిపుణుడైన ప్రొఫెసర్ డొమినిక్ ఫర్నీస్ చెప్పారు. "ఎడం చేతి అలవాటు మన మెదడు వృద్ధి చెందే క్రమంలో వచ్చే పరిణామం అని ఈ అధ్యయనం చెబుతోంది. దురదృష్టం, దుష్టశక్తులతో దానికి ఎలాంటి సంబంధమూ లేదు" అని ఫర్నీస్ అన్నారు. మనలో చాలా మంది కుడిచేతితో రాస్తారు. చిన్న పనైనా పెద్ద పనైనా సరే కుడి చేతి తోనే చేయడం ముందు నుంచి అలవాటుగా మారుతుంది. కుడి చేతికి ఉన్న బలం, ఎడమ చేతికి ఉండదు. అలాగే ఎడమ చేతికి ఉన్న బలం కుడి చేతికి ఉండదు. అయితే చాలామంది ఎడమ చేతి అలవాటు ఉన్నవాళ్ళకి గేలి చేస్తారు, ఆటపట్టిస్తారు. ఎడమ చేతి అలవాటు మధ్యలోనే పిల్లలకి ఈ అలవాటు వస్తుంది అనుకుంటారు కానీ పుట్టుకతోనే ఈ అలవాటు ఉంటుందని ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ అఖిరా విబర్గ్ అధ్యయనం చెబుతుంది. అంతేకాదు వాళ్ళ మెదడు భాగంలో కూడా మార్పులు జరుగుతాయట. ఈ మార్పులు అన్నీ తల్లి గర్భంలో ఉన్నప్పుడే జరుగుతాయట.

కావున కుడి, ఎడమైతే పొరపాటు లేదోయ్ అన్నట్లుగా ఎడమైతే, కుడి అయితే ఏంటి తేడా.. మన శరీరంలో ప్రతి ఒక్క భాగం చాలా ప్రత్యేకంగా సృష్టించబడింది. కావున ఎడమ చేతి వాటం వాళ్ల ప్రతిభను గుర్తించండి.

**– నేడు ప్రపంచ ఎడమ చేతి వాటం వాళ్ల దినోత్సవం సందర్భంగా**

# పండ్లతో ఓసారి వీటిని ట్రై చేయండి

### డేట్ యాపిల్ స్క్వేర్స్

**కావలసినవి:** ఖర్జూరం ముక్కలు – 2 కప్పులు(గింజలు తొలగించి, మిక్సీలో గుజ్జు చేసుకోవాలి), యాపిల్ గుజ్జు – అర కప్పు, బ్రౌన్ సుగర్ – ఒకటిన్నర కప్పులు, నీళ్లు – ఒకటిన్నర కప్పులు, నిమ్మరసం – 1 టేబుల్ స్పూన్, బటర్ – 1 కప్పు, ఓట్స్ పిండి, బియ్యం పిండి, మొక్కజొన్న పిండి – పావు కప్పు చొప్పున, వాల్‌నట్, జీడిపప్పు – 2 లేదా 3 టేబుల్ స్పూన్లు చొప్పున (మిక్సీ పట్టుకోవాలి), కొబ్బరి తురుము – పావుకప్పు

**తయారీ:** ముందుగా ఒక పాన్ బౌల్ తీసుకుని అందులో నీళ్ల, అర కప్పు బ్రౌన్ సుగర్ వేసుకుని, గరిటెతో తిప్పుతూ ఉండాలి. కాసేపటికి ఖర్జూరం గుజ్జు వేసుకోవాలి. తర్వాత నిమ్మరసం కూడా వేసుకుని దగ్గరకు అయ్యేదాకా ఉడికించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మరో బౌల్ తీసుకుని అందులో బటర్, 1 కప్పు బ్రౌన్ సుగర్, బియ్యం పిండి, ఓట్స్ పిండి, కొబ్బరి తురుము, మొక్కజొన్న పిండి, వాల్‌నట్, జీడిపప్పు పౌడర్ వేసుకుని కలుపుకోవాలి. తర్వాత యాపిల్ గుజ్జు కూడా వేసుకుని బాగా కలుపుకుని, ఒకటిన్నర లేదా 2 అంగుళాల లోతున్న చతురస్ర లేదా దీర్ఘచతురస్రాకారపు ట్రే తీసుకుని.. అందులో బటర్–యాపిల్ మిశ్రమాన్ని కొద్దిగా వేసుకుని, దానిపైన ఖర్జూరం మిశ్రమాన్ని వేస్రుకుని సమాంతరం చేసుకోవాలి. తర్వాత మిగిలిన బటర్ మిశ్రమాన్ని కూడా వేసుకుని మరోసారి సమాంతరం చేసుకుని, 25 నుంచి 30 నిమిషాల పాటు ఓవెన్‌లో ఉడికించుకుని కావల్సిన షేప్‌లో కట్ చేసుకోవాలి.



### అరటిపండు హాట్‌కేక్స్

**కావలసినవి:** అరటి పండ్లు – 6, మొక్కజొన్న పొడి, బియ్యం పిండి – అర కప్పు చొప్పున, మైదాపిండి – 3 టేబుల్ స్పూన్లు, పంచదార – 2 టేబుల్ స్పూన్లు, పాలు – ఒకటిన్నర కప్పులు, నీళ్లు – కొద్దిగా, నూనె – సరిపడా, తేనె– 2 గరిటెలు (గార్నిష్‌కి)

**తయారీ:** ముందుగా 4 అరటిపండ్లు, పాలు ఒక మిక్సీ పాత్రలో వేసుకుని మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఒక పెద్ద పాత్ర తీసుకుని అందులో మొక్కజొన్న పొడి, బియ్యప్పిండి, మైదాపిండి, పంచదార వేసుకుని, అరటిపండు–పాల మిశ్రమాన్ని కొద్దికొద్దిగా వేసుకుంటూ కలుపుకుని, 1 గంట పాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. తర్వాత నాన్ స్టిక్ పాన్ తీసుకుని, నూనె వేసుకుని, ఒకసారి ఆ మిశ్రమాన్ని బాగా కలిపి.. అవసరం అయితే కొద్దిగా నీళ్లు వేసుకుని, చిన్న చిన్న పాన్ కేక్స్ వేసుకోవాలి. ఇప్పుడు మిగిలిన అరటిపండ్లను నచ్చిన షేప్‌లో కట్ చేసుకుని, తేనెతో గార్నిష్ చేసుకుని వేడి వేడిగా ఉన్నప్పుడే తింటే.. భలే టేస్టీగా ఉంటాయి. అభిరుచిని బట్టి ఇష్టమైన ఫ్రూట్స్‌తో ఈ పాన్‌కేస్ కలిపి సర్వ్ చేసుకోవచ్చు.



### కోకోనట్ ట్రఫిల్

**కావలసినవి:** కొబ్బరి తురుము – ముప్పావు కప్పుం4 టేబుల్ స్పూన్లు, కొబ్బరి పాలు – 2 కప్పులు, తేనె – 4 టేబుల్ స్పూన్స్, బటర్ – 1 టేబుల్ స్పూన్, వెనీలా ఎక్స్‌ట్రా – అర టీ స్పూన్

**తయారీ:** ముందుగా స్టవ్ ఆన్ చేసుకుని, బౌల్‌లో కొబ్బరి పాలు, తేనె వేసుకుని.. కొబ్బరిపాల మిశ్రమం దగ్గర పడేంత వరకూ మధ్యమధ్యలో గరిటెతో తిప్పుతూ ఉండాలి. ఇప్పుడు అందులో బటర్, కొబ్బరి తురుము, వెనీలా వేసుకుని ఓ ఐదు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. తర్వాత స్టవ్ దించుకుని కాస్త చల్లారగానే.. రెండు గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి.

తర్వాత ఆ మిశ్రమాన్ని చిన్న చిన్న బాల్స్‌లా చుట్టి.. మిగిలిన కొబ్బరి తురుముని వాటికి బాగా పట్టించి సర్వ్ చేసుకోవాలి.

# పసందైన వంటకాలు మీకోసం



### కార్న్ కబాబ్స్

**కావలసినవి:** ఉడికించిన స్వీట్ కార్న్ – ఒకటిన్నర కప్పులుం8 టేబుల్ స్పూన్లు, బంగాళదుంపలు – 2 (ముక్కలుగా కోసుకుని మెత్తగా ఉడికించుకోవాలి), ఉల్లిపాయ ముక్కలు – 3 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి ముక్కలు – అర టీ స్పూన్, క్యాప్సికం – సగం, అటుకులు – 1 కప్పు (అప్పటికప్పుడు నీళ్లలో తడిపి, గట్టిగా పిండుకోవాలి), శనగ పిండి – 2 టేబుల్ స్పూన్లు, అల్లం పేస్ట్ – పావు టీ స్పూన్, ఉప్పు – తగినంత, కారం – కొద్దిగా, కొత్తిమీర తురుము – కొంచెం, నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

**తయారీ:** ముందుగా మిక్సీ బౌల్‌లో ఉడికించిన ఒకటిన్నర కప్పుల స్వీట్ కార్న్, బంగాళ దుంప ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు,తడిపిన అటుకులు వేసుకుని మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు అందులో శనగపిండి, అల్లం పేస్ట్, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసుకుని బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఒక పాన్‌లో నూనె, మిగిలిన 5 గరిటెల స్వీట్ కార్న్, కారం, కొత్తిమీర తురుము వేసుకుని దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బంగాళదుంప మిశ్రమంలో 3 టేబుల్ స్పూన్ల స్వీట్‌కార్న్ వేసుకుని.. ఒకసారి పైపైన కలిపి, వడల్లా చేసుకుని నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి. మిగిలిన స్వీట్ కార్న్‌తో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి.



### బ్రింజాల్ రోల్స్

**కావలసినవి:** వంకాయలు – 4 పెద్దవి, ఉల్లికాడ ముక్కలు – 2 టేబుల్ స్పూన్లు, టమాటా ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు చొప్పున (గార్నిష్‌కి అదనంగా), కొత్తిమీర తరుగు – 2 టీ స్పూన్లు (గార్నిష్‌కి అదనంగా), పుదీనా తరుగు – 1 టేబుల్ స్పూన్లు, బీట్ రూట్ తురుము – పావు కప్పు, బియ్యం రవ్వ – ముప్పావు కప్పు(ఉడికించుకుని పక్కన పెట్టుకోవాలి), ఆలివ్ నూనె – 2 టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి – అర టీ స్పూన్, నిమ్మరసం – 4 టేబుల్ స్పూన్లు, నూనె – డీప్ ఫ్రైకి సరిపడా, జీలకర్ర పొడి – అర టీ స్పూన్, వేరుశనగల పొడి – పావు కప్పు (రవ్వలా మిక్సీ పట్టుకోవాలి), ఉప్పు – తగినంత

**తయారీ:** ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో రెండున్నర గరిటెల నూనె వేసుకుని వేడి కాగానే ఉల్లిపాయ ముక్కలు, ఉల్లికాడ ముక్కలు, బీట్‌రూట్ తురుము, టమాటా ముక్కలు, పుదీనా తరుగు, కొత్తిమీర తరుగు, వేరుశనగల పొడి, జీలకర్ర పొడి, మిరియాల పొడి ఒకదాని తర్వాత ఒకటి వేసుకుంటూ గరిటెతో తిప్పుతూ దోరగా వేయించుకోవాలి. ఇప్పుడు అందులో ఉడికించిన బియ్యం రవ్వను కూడా వేసుకుని గరిటెతో తిప్పుతూ ఉండాలి. ఆలివ్ నూనె, నిమ్మరసం వేసుకుని బాగా తిప్పుతూ ఉండాలి. చివరిగా ఉప్పు కూడా వేసుకుని బాగా కలుపుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. తర్వాత వంకాయలను పొడవుగా (థిన్ స్లైస్‌లా) కట్ చేసుకుని, నూనెలో డీప్ ఫ్రై చేసుకుని, అందులో కొద్ది కొద్దిగా ఉల్లికాడల మిశ్రమాన్ని ఉంచుతూ రోల్స్‌లా చుట్టుకోవాలి. ఊడిపోకుండా సన్నని పుల్ల అడ్డంగా గుచ్చుకుని తీనేటప్పుడు ఆ పుల్లని తొలగించుకోవచ్చు. వీటిని కొత్తిమీర తరుగు, టమాటా ముక్కలతో లేదా ఇష్టమైన డ్రై ఫ్రూట్స్‌తో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి.




### బీట్‌రూట్ చపాతి

**కావలసినవి:** బీట్‌రూట్ గుజ్జు - 1 కప్పు, గోధుమ పిండి - 1 కప్పు, అల్లం - వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి పేస్ట్ - 1 టీ స్పూన్ చొప్పున, వాము పొడి - అర టీ స్పూన్, ఉప్పు - తగినంత, ఆలివ్ నూనె - 1 టీ స్పూన్, నీళ్లు - సరిపడా, నూనె - కొద్దిగా, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తురుము - గార్నిష్‌కి

**తయారీ:** ముందుగా ఒక పెద్ద బౌల్‌లో గోధుమ పిండి, బీట్‌రూట్ గుజ్జు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, ఆలీవ్ నూనె వేసుకుని బాగా కలుపుకోవాలి. తర్వాత వాము పొడి కూడా అందులో వేసుకుని, కొద్ది కొద్దిగా నీళ్లు కలుపుకుంటూ చపాతి ముద్దలా చేసుకోవాలి. ఇప్పుడు కోడిగుడ్డంత పరిమాణంలో ముద్దలు తీసుకుని చపాతి కర్రతో చపాతీలా చేసుకోవాలి. ఇప్పుడు పాన్‌పైన నూనె వేసి దోరగా వేయించుకుని.. ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తురుముతో గార్నిష్ చేసుకుంటే భలే టేస్టీగా ఉంటాయి.

# వచ్చే ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తా

## మోదీకి మాటిచ్చిన అమన్ సెహ్రావత్



**విశ్వంభర, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్ లో ఫైనల్స్ కు ముంగిట వినేశ్ ఫొగాట్ అనర్హత వేటుకు గురవడం భారత అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. దీంతో రెజ్లింగ్లో ఈ సారి పతకం రాదని భావించారు. కానీ, యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ అదరగొట్టాడు.ఫ్రీస్టైల్ 57 కిలోల విభాగంలో కాంస్య సాధించి కాస్త ఊరటనిచ్చాడు. ఫలితంగా వరుసగా అయిదో ఒలింపిక్స్ లోనూ రెజ్లింగ్లో భారత్కు పతకం దక్కింది. ఈ క్రమంలోనే ఒలింపిక్స్లో వ్యక్తిగత పతకం గెలిచిన అతి పిన్న వయస్సు (21 ఏళ్ల 24 రోజులు) భారత అథ్లెట్గా అతను చరిత్ర సృష్టించాడు. 11 ఏళ్లకే అమ్మానాన్నలను కోల్పోయిన అమన్ పట్టుదలతో కష్టాల ప్రయాణాన్నిదాటి.. విశ్వ క్రీడల పోడియంపై నిలబడ్డాడు. దీంతో అమన్పై సినీనటులు, క్రీడాకారులు ప్రశంసలకురిపిస్తున్నారు.భారత ప్రధాని నరేంద్ర మోదీ అమన్ సెహ్రావత్కు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. అతని జీవితం ఇతరులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అమన్ సాధించిన ఈ ఫీట్ను భారత ప్రజలను చిరకాలం గుర్తుంచుకుంటారని మోదీ పేర్కొన్నారు. సెహ్రావత్ చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడని, జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూనే రెజ్లింగ్పై దృష్టిపెట్టాడన్నారు. రెజ్లింగ్లో రాణించడానికి ప్రభుత్వపరంగా తనకు అన్ని సౌకర్యాలు కల్పించినందుకు ప్రధానికి అమన్ కృతజ్ఞతలు తెలిపాడు. 2028లో జరిగే ఒలింపిక్స్లో గోల్డ్ మెడల్ సాధిస్తానని మోదీకి మాటిచ్చాడు.





# 'హాకీ'లో రెండు స్వర్ణాలు..

## చరిత్ర సృష్టించిన నెదర్లాండ్స్

**విశ్వంభర, స్పోర్ట్స్:** ఒలింపిక్స్‌లో చరిత్రలో కనీవినీ ఎరుగని అద్భుతం జరిగింది. హాకీలో నెదర్లాండ్స్ రెండు స్వర్ణాలు కొల్లగొట్టింది. విశ్వ క్రీడల్లో డచ్ పురుషుల, మహిళల హాకీ జట్లు పసడితో మెరిశాయి. దాంతో, ఒలింపిక్స్ చరిత్రలో హాకీలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన తొలి దేశంగా నెదర్లాండ్స్ చరిత్ర పుటల్లో నిలిచింది.నెదర్లాండ్స్ పురుషుల హాకీ జట్టు హోరాహోరీగా జరిగిన సెమీ ఫైనల్లో జర్మనీని ఓడించి పసిడిని అందించింది. ఆ తర్వాత తమ వంతు అన్నట్టు ఆ దేశ మహిళలు సైతం ఫైనల్లో చైనాకు చెక్ పెట్టి బంగారాన్ని ఒడిసిపట్టింది.శనివారం జరిగిన మహిళల హాకీ ఫైనల్లో నెదర్లాండ్స్, చైనా జట్లు నువ్వానేనా అన్నట్టు తలపడ్డాయి. ఆరో నిమిషంలో చైనా ఫార్వర్డ్ చెన్ యి తొలి గోల్ కొట్టింది. అనంతరం చైనా డిఫెన్స్ ఆయుధంగా నెదర్లాండ్స్‌ను నిలువరించే ప్రయత్నం చేసింది. కానీ, డచ్ ప్లేయర్ ఇబ్బి జాన్‌సెన్ సూపర్ గోల్‌తో స్కోర్ సమం అయింది. అనంతరం నిర్వహించిన షూటౌట్‌లో నెదర్లాండ్స్ అమ్మాయిల జట్టు 3–1తో చైనాను ఓడించింది. మరోవైపు నెదర్లాండ్స్ పురుషుల జట్టు జర్మనీని మట్టికరిపించిన స్వర్ణ పతకాన్ని తన్నుకుపోయింది. మ్యాచ్ సమయానికి స్కోర్లు 1–1తో సమం కాగా షూటౌట్‌లో డచ్ ఆటగాళ్లు సత్తా చాటారు. దాంతో, 3–1తో నెదర్లాండ్ జట్టు విజేతగా నిలిచింది.

# తీర్పు నేటికి వాయిదా వేసిన సీఏఎస్

## తనకు రజత పతకం ఇవ్వాలని అప్పీలు



**పారిస్:** పారిస్ ఒలింపిక్స్లో రెజ్లింగ్ ఫైనల్కు చేరిన వినేశ్ ఫొగాట్ పై ఒలింపిక్ కమిటీ,రెజ్లింగ్ కమిటీ అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. అనర్హతను సవాలు చేస్తూ వినేశ్ ఫొగాట్ చేసిన అభ్యర్థనను కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) స్వీకరించింది. దీనిపై తీర్పు శనివారం వస్తుందని భావించారు. కానీ, తీర్పును క్రీడా ఆర్బిట్రేషన్ కోర్టు ఆగస్టు 11కి వాయిదా వేసింది. 100 గ్రాములు అదనపు బరువు కారణంగా అనర్హతకు గురైన వినేశ్ ఫొగాట్.. తనకు రజత పతకం ఇవ్వాలని అప్పీలులో కోరారు. ఒకవేళ తీర్పు వినేశ్కు అనుకూలంగా వస్తే.. ఐఓసీ ఆమెకు సంయుక్తంగా రజత పతకం ఇవ్వాల్సి వుంటుంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే వినేశ్ రెజ్లింగ్ కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే.




# ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు తేవాలి

## బ్యాంకులకు నిర్మలా సీతారామన్ సూచన

**ఢిల్లీ:** బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గుతున్న వేళ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులకు కీలక సూచన చేశారు. ప్రజల నుంచి డిపాజిట్లను ఆకర్షించడానికి వినూత్న ఉత్పత్తులను తీసుకురావాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బోర్డు సమావేశం అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. రుణాలకు, డిపాజిట్లకు సమతూకం ఉండాలన్నారు.డిపాజిట్ల సేకరణ విషయంపై బ్యాంకులు దృష్టి సారించాలని నిర్మలా సీతారామన్ అన్నారు. తద్వారా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా సమకూర్చాలన్నారు. అప్పుడే డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరం తగ్గుతుందన్నారు. ఇందులో భాగంగా వినూత్న, ఆకర్షణీయ డిపాజిట్ పథకాలను తీసుకురావాలని బ్యాంకులకు సూచించారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సైతం దీనిపై మాట్లాడారు. వడ్డీ రేట్లను డీ రెగ్యులేట్ చేశామని, బ్యాంకులు సొంతంగా డిపాజిట్లను పెంచుకోవడానికి రేట్లను పెంచుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో బ్యాంకులకు ఆ స్వేచ్ఛ ఉందన్నారు. ఇటీవల ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల వెల్లడి సందర్భంలోనూ డిపాజిట్ల అంశాన్ని ప్రస్తావించిన సంగతి తెలిసిందే.

# సిస్కోలో భారీగా ఉద్యోగుల తొలగింపులు

## టెక్ కంపెనీల్లో కొనసాగుతున్న లేఆఫ్‌ల పర్వం




**విశ్వంభర, బిజినెస్:** టెక్ కంపెనీల్లో లేఆఫ్ ల పర్వం ఇంకా కొనసాగుతోంది. మొన్నటివరకు మాంద్యం భయాలతో పెద్దసంఖ్యలో ఉద్యోగులను తొలగించిన సంస్థలు ఇప్పుడు ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకొనే క్రమంలో లేఆఫ్లు ప్రకటిస్తున్నాయి. ఇటీవల ప్రముఖ కంప్యూటర్ల తయారీ సంస్థ డెల్ పెద్దఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించగా.. తాజాగా ప్రముఖ నెట్వర్కింగ్ సంస్థ సిస్కో సైతం అదే బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే రెండో రౌండ్ తొలగింపులను చేపట్టనుందని సమాచారం. తగ్గిన డిమాండ్, సరఫరాల్లో అంతరాయం వల్ల కంపెనీ తన ప్రధాన వ్యాపారంలో సవాళ్లను ఎదుర్కొంటోంది. మరోవైపు సైబర్ సెక్యూరిటీ, ఏఐ.. వంటి రంగాల వైపు దృష్టిసారించే పనిలో సిస్కో పడింది. 2025 నాటికి ఏఐ ఉత్పత్తుల ఆర్డర్లో బిలియన్ను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులోభాగంగా ఉద్యోగులను తగ్గించుకొనేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరిలో 4,000 మందికి లేఆఫ్లు ప్రకటించిన సంస్థ తాజాగా అదే సంఖ్యలో ఉద్యోగులను ఇంటికి పంపేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కంపెనీ నాలుగో త్రైమాసిక ఫలితాలతో పాటు ఉద్యోగుల తొలగింపు ప్రకటన అధికారికంగా వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. ఇదిలాఉండగా.. డెల్ గతేడాది రెండు రౌండ్లలో ఏకంగా 13 వేల మందికి ఉద్వాసన పలికింది. ఇంటెల్ సంస్థ ఇటీవల 15వేల మందికి ఉద్వాసన పలికిన విషయం తెలిసిందే.

# యూట్యూబ్ మాజీ సీఈవో కన్నుమూత




**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ వీడియో ప్లాట్ఫామ్ యూట్యూబ్ కు సుదీర్ఘకాలం పాటు సీఈఓగా సేవలందించిన సుశాన్ వొజ్కికి (56) కన్నుమూశారు. క్యాన్సర్తో పోరాడుతూ మృతి చెందారు. ఆమె మృతిపట్ల గూగుల్ పిచాయ్ విచారం వ్యక్తం చేశారు. ఇంటర్నెట్ ప్రపంచంలో యూట్యూబ్ను వీడియో అగ్రగామిగా నిలపడంలో వొజ్కికి కీలకపాత్ర పోషించారు. 1998 లో గూగుల్ చేరిన ఆమె.. 2014 నుంచి 2023 వరకు యూట్యూబ్కు సీఈఓగా కొనసాగారు. ఆమె హయాంలో యూట్యూబ్ వేగంగా వృద్ధి చెందింది. యూట్యూబ్ ప్రీమియం, యూట్యూబ్ టీవీ– యూట్యూబ్ షార్ట్స్ వంటివి పురుడు పోసుకున్నాయి. 2023లో ఆమె తన పదవికి రాజీనామా చేశారు. రెండేళ్లుగా ఊపిరితిత్తుల క్యాన్సర్ తో పోరాడుతూ తుది శ్వాస విడిచారు. వొజ్కికి మరణం తీరని లోటని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. గూగుల్ చరిత్రలో ఆమెది కీలక పాత్ర అని, అమెలేని ప్రపంచాన్ని ఊహించలేకపోతున్నామని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తన స్నేహితురాలైన వొజ్కికి మరణం తనను ఎంతగానో కలచి వేసిందని, ఆమె కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నట్లు పిచాయ్ ఎక్స్లో పోస్ట్ చేశారు.

# ఎక్స్ లో ఇక పేమెంట్స్ కూ అవకాశం



**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'ను సొంతం చేసుకున్నప్పటి నుంచి బిలియనీర్ ఎలాన్ మస్క్ ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. కేవలం సమాచారం పంచుకోవడానికి మాత్రమే ఉపయోగించిన యాప్ను ఇప్పుడు ఆల్–ఇన్–వన్ యాప్ గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే పేమెంట్స్ ఫీచర్ను పరిచయం చేయనున్నట్లు సమాచారం. ఎక్స్లో రానున్న ఈ కొత్త ఫీచర్కు సంబంధించిన పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. ట్విటర్ ను 'ఎక్స్'గా మార్చాక.. దీన్నో సూపర్ యాప్ తీర్చిదిద్దుతానని ఎలాన్ మస్క్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఆడియో, వీడియో కాల్స్ సదుపాయం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో ముందడుగు వేసి తన ప్లాట్ఫామ్ వేదికగా పేమెంట్స్ జరిపే సదుపాయాన్ని తీసుకురావాలని చూస్తోంది. అంటే ఇకపై ఎక్స్ సాయంతోనే ఆన్లైన్ పేమెంట్స్ చేయొచ్చన్నమాట. ఈ కొత్త ఫీచర్లకు సంబంధించి స్క్రీన్ షాట్ అనే ఓ వెబ్ డెవలపర్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. త్వరలోనే పేమెంట్స్ యాప్ రానుందని వెల్లడించారు. లావాదేవీలు జరపడంతో పాటు, బ్యాలెన్స్, పేమెంట్స్ హిస్టరీ కూడా అక్కడే తెలుసుకోవచ్చు. అయితే 'ఎక్స్'లో రాబోయే ఈ ఫీచర్ వాలెట్ సిస్టమ్ లాగా ఉంటుందా? లేదా నేరుగా బ్యాంక్ ఖాతాలకు లింక్ చేయొచ్చా? అనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది.



# కుర్రాళ్లను కవ్విస్తోన్న దీప్తి సునైనా..

తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతో మంది అమ్మాయిలు గ్లామర్ ఫీల్డులోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో కొందరు మాత్రం సోషల్ మీడియా సహాయంతో వెలుగులోకి వచ్చి సెన్సేషన్‌గా మారిపోయారు. తద్వారా బుల్లితెరపై, వెండితెరపై ఆఫర్లను అందుకున్నారు. వారిలో దీప్తి సునైనా ఒకరు. ఈ పిల్ల వదిలిన పిక్స్ మీకోసమే! సోషల్ మీడియా ఖాతాల ద్వారా హైలైట్ అయిన దీప్తి సునైనా యూట్యూబర్‌గా మారింది. ఈ క్రమంలోనే ఎన్నో రకాల డ్యాన్స్ వీడియోలు, కవర్ సాంగ్‌లు, షార్ట్ ఫిల్మ్‌లు చేసింది.వీడియోల వల్ల దీప్తి సునైనా చాలా తక్కువ సమయంలోనే ఎనలేని క్రేజ్‌ను అందుకుంది. దీంతో సోషల్ మీడియాలో ఈ పిల్ల సంచలనం అయిపోయింది. అదే సమయంలో ఫిల్మ్ మేకర్ల దృష్టిలోనూ పడిపోయింది. యూట్యూబర్‌గా ఫేమస్ అవడంతో దీప్తి సునైనాకు ఆఫర్లు వెల్లువెత్తాయి. అలా ఈ భామ బిగ్ బాస్ తెలుగు రెండో సీజన్‌లో కంటెస్టెంట్‌గా పాల్గొనే అవకాశం లభించింది.బిగ్ బాస్‌లో దీప్తి ఆటతో పాటు గొడవలు పెట్టుకుంటూ, అందాలను ఆరబోస్తూ యమ హైలైట్ అయింది. అలాగే, హీరో తనీష్‌తో యమ క్లోజ్‌గా ఉంటూ రచ్చ చేసింది. దీంతో దీప్తి సునైనా క్రేజ్ ఫుల్లుగా పెరిగిపోయింది.కెరీర్ ఆరంభంలోనే దీప్తి సునైనా.. మరో యూట్యూబర్ షణ్ముఖ్ జస్వంత్‌తో లవ్ ట్రాకును సాగించింది. అలా చాలా కాలం పాటు వీళ్లిద్దరూ ప్రేమలో మునిగి తేలారు. ఫలితంగా జంటగానే వీళ్లిద్దరూ ఫుల్ పాపులర్ అయిపోయారు.యూట్యూబర్‌గా కెరీర్ మొదలెట్టిన తర్వాత చాలా కాలం పాటు వరుసగా వీడియోలు చేస్తూ ఫ్యాన్స్‌ను అలరించిన దీప్తి సునైనా.. ఈ మధ్య కాలంలో మాత్రం చాలా స్లో అయిపోయింది.దీప్తి సునైనా అడపాదడపా మాత్రమే వీడియోలు చేస్తోంది. ఇలా ఆ మధ్య 'ఏమోనే' అనే క్యూట్ రొమాంటిక్ సాంగ్‌తో వచ్చింది. తర్వాత కూడా స్పీడ్ పెంచకపోవడం చాలా మందిని ఆశ్చర్యపరుస్తోంది.దీప్తి సునైనా వెలుగులోకి వచ్చి సంచలనంగా మారిపోవడానికి సోషల్ మీడియానే కారణం అని అందరికీ తెలిసిందే. అందుకే ఆమె ఇందులోనే ఎప్పుడూ హడావిడి చేస్తుంటుంది.సోషల్ మీడియాలో ఎంతో కాలంగా విపరీతంగా హడావిడి చేస్తూ కుర్రాళ్లను కవ్విస్తోన్న దీప్తి సునైనా.. ఈ మధ్య కాలంలో మరింతగా డోస్ పెంచుతూనే ఉంటోంది.దీప్తి సునైనా కొన్ని హాట్ ఫొటోలను కూడా వరుస పెట్టి షేర్ చేస్తోంది. ఇందులో ఎక్కువగా తన సీక్రెట్ అందాలను చూపిస్తూ ఫోజులిస్తోంది. దీంతో ఈ తెలుగు పిల్ల పేరు తరచూ సెన్సేషన్ అవుతోంది.

# నేడు మట్కా నుంచి ఫస్ట్ లుక్ విడుదల

మెగా హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం ఒక సాలిడ్ హిట్ కోసం ఎదురు చూస్తున్నాడు. 2019లో ఆయన నటించిన గద్దలకొండ గణేష్ తర్వాత వచ్చిన గని, F3, గాండీవధారి అర్జున, ఆపరేషన్ వాలెంటైన్ చిత్రాలలో ఒక్క సినిమా కూడా హిట్ కాలేదంటే హిట్ కోసం వరుణ్ ఎంత కరువులో ఉన్నాడో చెప్పుకోవచ్చు. అయితే వరుణ్ తేజ్ ఆశలన్నీ ప్రస్తుతం వస్తున్న పాన్ ఇండియా సినిమా మట్కా పైనే ఉన్నాయి. మట్కాతో హిట్ కొట్టి మళ్లీ ఫామ్‌లోకి రావాలని చూస్తున్నాడు ఈ మెగా హీరో. పలాస 1978 సినిమాతో హిట్ అందుకున్న కరుణ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ఆగష్టు 11న ఉదయం 11.07 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 1958-1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. ఇప్పటికే సగ భాగానికి పైగా చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. నవీన్ చంద్ర, కిశోర్, రవీంద్ర విజయ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

# అందరికీ నచ్చేలా సినిమా చేయలేం





**హైదరాబాద్:** దాదాపు 16 మంది నూతన నటీనటులతో నిహారిక నిర్మించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. యదువంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ నేపథ్యంలో చిత్రబృందం శనివారం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఇందులో పాల్గొన్న నిహారిక భావోద్వేగానికి గురయ్యారు. తమ ప్రాజెక్ట్ ఇప్పుడు ప్రజల సినిమా అయ్యిందన్నారు.

"మీరు పెట్టిన ప్రతి రూపాయి స్క్రీన్పై కనిపిస్తుందని చాలామంది అంటున్నారు. ఆ ప్రశంసలు అందుకున్నందుకు ఒక నిర్మాతగా ఆనందంగా ఉంది. ఈ సినిమా సక్సెస్ లో భాగమైన వారందరికీ అభినందనలు. నాకు సపోర్ట్ చేసిన వారికి ధన్యవాదాలు. నా సోదరుడు, నటుడు అంకిత్.. ఓసారి ఫోన్ చేసి.. తన స్నేహితుడి వద్ద మంచి కథ ఉందని చెప్పాడు. నాకు పెద్దగా ఆసక్తి కలగలేదు. వేర్వేరు కారణాలు చెప్పి మూడు నెలలు వాయిదా వేశా. అతడు అంతలా అడుగుతుంటే కాదనలేక కథ వినడానికి అంగీకరించా. నా జీవితంలో నేను తీసుకున్న మంచి నిర్ణయాల్లో అది కూడా ఒకటి. కమిటీ కుర్రోళ్ళు కథ విన్నా. దాని తర్వాత నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. మా సినిమా చూసి కొంతమంది సెకండాఫ్లో లో ఇది బాలేదు.. అది బాలేదని రివ్యూలు రాస్తున్నారు. వారికి నేను చెప్పేది ఒక్కటే మేము వందశాతం మందికి నచ్చేలా సినిమా చేయలేం. 99శాతం మందికి మా సినిమా నచ్చింది. ఇది ఇప్పుడు పీపుల్స్ మూవీ అయింది. మా సినిమాని కామెంట్ చేస్తూ ఎవరైనా కామెంట్స్ చేస్తుంటే.. మా చిత్రాన్ని ఆదరించిన వారే వారికి రిప్లైలు ఇస్తున్నారు" అని నిహారిక భావోద్వేగానికి గురయ్యారు.

**భవిష్యత్తులో చరణ్, బన్నీ, వరుణ్ తేజలతో సినిమాలు చేస్తారా?**

నిహారిక నా మొదటి ప్రాధాన్యత కథకే. నా వద్దకు ఏదైనా కథ వస్తే.. అది తప్పకుండా వాళ్లకు సూట్ అవుతుందనిపిస్తే తప్పకుండా వాళ్లతో కలిసి వర్క్ చేస్తా.

**చిరంజీవితో ఏదైనా సక్సెస్ మీట్ ప్లాన్ చేస్తున్నారా?**

నిహారిక: మా చిత్రానికి ఇంత మంచి పేరు వచ్చిన తర్వాత నేను మొదట ఫోన్ చేసింది ఆయనకే. ఆయనతో మాట్లాడా. ఆయన చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఆయనతో ఏదైనా ప్రోగ్రామ్ ప్లాన్ చేద్దాం అనుకుంటున్నా.

**కమిటీ కుర్రోళ్ళుకు మీకు వచ్చిన రివ్యూలు ఏమిటి?**

నిహారిక: ఎంతో ప్రశంసలు అందుకుంటున్నాను. అయితే, ఫస్టాఫ్ లో ఉన్నంత హైప్ సెకండాఫ్లో లేదని పలువురు రివ్యూలు రాశారు. వారికి నేను చెప్పేది ఒక్కటే అందరికీ నచ్చేలా సినిమా చేయలేం. ఇది నా లైఫ్.

## కాస్ట్యూమ్స్ నచ్చకపోవడంతో షారూఖ్ తో
# సినిమా చేయనని చెప్పా


**ముంబయి:** 'యే లమ్హే జుదాయి కే', 'జాదు', 'జమానా దివానా' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది. షారుక్ ఖాన్ , రవీనా టాండన్ జోడీ. వీరిద్దరి కాంబోలో మరో సినిమాకు రంగం సిద్ధమైనప్పటికీ.. దానిని తాను రిజక్ట్ చేశానని తాజాగా నటి రవీనాటాండన్ తెలిపారు. ఓ ఫిల్మ్ మ్యాగజైన్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని బయటపెట్టారు. కాస్ట్యూమ్స్ నచ్చకపోవడంతో తాను ఆ సినిమా చేయనని చెప్పానన్నారు. "షారుక్ ఖాన్ హీరోగా నటించిన ఓ చిత్రానికి తొలుత నన్నే కథానాయికగా అడిగారు. కథ, అందులో నా పాత్ర నాకెంతో నచ్చాయి. సినిమాకు సంతకం చేసే సమయంలో కాస్ట్యూమ్స్ గురించి చర్చించారు. చిత్రబృందం నేను ధరించాల్సిన దుస్తుల గురించి చెప్పినప్పుడు షాకయ్యా. చాలా ఇబ్బందిగా అనిపించింది. నాకు సౌకర్యవంతంగా అనిపించలేదు. చిన్న విషయమైనప్పటికీ ఆ ప్రాజెక్టుకు నేను నో చెప్పా. ఆ దుస్తులు ధరించి యాక్ట్ చేయలేనని తెలిపా. ఈ విషయం తెలిసి షారుక్ షాకయ్యారు. 'నీకు ఏమైనా పిచ్చిపట్టిందా? నో చెప్పాల్సిన అవసరం ఏముంది?' అని ప్రశ్నించారు. మనం మరెన్నో చిత్రాలతో ప్రేక్షకులను అలరించాలి కదా అన్నారు. కాస్ట్యూమ్స్ వల్ల నేను చేయలేకపోతున్నానని తెలిపా. దానిని ఆయన అర్థం చేసుకున్నారు" అని రవీనాటాండన్ చెప్పారు. షారుక్ నటించిన 'డర్లో తొలుత తనకే అవకాశం వచ్చిందని.. కాకపోతే తాను దానిని కూడా రిజక్ట్ చేశానని గతంలో ఓ సందర్భంలో రవీనా తెలిపారు.'పత్తర్ కే ఫూల్తో నటిగా ఎంట్రీ ఇచ్చిన రవీనాటాండన్ బాలీవుడ్ స్టార్ హీరోల చిత్రాల్లో యాక్ట్ చేశారు. నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె సహాయనటిగా యాక్ట్ చేస్తున్నారు. 2022లో విడుదలైన 'కేజీయఫ్ 2' చిత్రంలో రమికాసేన్గా కనిపించి మెప్పించారు. ప్రస్తుతం ఆమె 'వెల్కమ్ టు ది జంగిల్లో లో యాక్ట్ చేస్తున్నారు.

# ఒకే వేదికపై రానున్న చిరంజీవి, బాలకృష్ణ



**హైదరాబాద్:** బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టాక్ షో 'అన్స్టాపబుల్'. ఇప్పటికే మూడు సీజన్లు పూర్తి చేసుకున్న ఈ షో కొత్త సీజన్ కోసం సిద్ధమవుతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయి. కొత్త సీజన్ సరికొత్త సర్ప్రైజ్లతో సిద్ధమవుతోంది. ఇప్పటికే చిత్ర పరిశ్రమలోని కథానాయకులు, దర్శకులు, ఇతర ప్రముఖులతో సందడి చేసిన ఈ షో ఇప్పుడు మరింత జోష్తో సాగనుంది. ఈసారి ముఖ్య అతిథిగా అగ్ర కథానాయకుడు చిరంజీవి రాబోతున్నారు. అధికారికంగా ప్రకటన వెలువడటమే తరువాయి. చిరు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన వెలువడవచ్చని టాక్ వినిపిస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో చిరంజీవి, బాలకృష్ణలది ప్రత్యేక స్థానం. మాస్ హీరోలుగా వాళ్లకున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాంటి స్టార్లు ఒకే వేదికపై కనిపిస్తే, అభిమానులకు అంతకుమించిన వినోదం ఏముంటుంది. చిరుతో పాటు, మరో అగ్ర కథానాయకుడు నాగార్జున కూడా ఈ సారి పాల్గొంటారని తెలుస్తోంది. వీళ్లతో పాటు, మరికొన్నిసర్ప్రైజ్ ఉంటాయని తెలుస్తుంది. దీనిపై 'ఆహా' నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## 'మా'కు రూ.10 లక్షల విరాళం
# ఇచ్చిన హీరో విష్ణు



మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు మరోసారి తన మంచి మనసును చాటుకున్నాడు. తన కూతురు ఐరా విద్య మంచు పుట్టిన రోజు సందర్భంగా మా అసోసియేషన్‌కి పది లక్షల విరాళాన్ని ప్రకటించారు. అసోసియేషన్‌లో ఆర్థికంగా వెనుకబడిన కళాకారుల సంక్షేమం కోసం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. కళాకారులకు సహాయం చేయడం, వారికి అవసరమైన సపోర్ట్, సంరక్షణ అందేలా చేయడం కోసం ఈ మొత్తాన్ని ఉపయోగించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.గత మూడు సంవత్సరాలలో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ విష్ణు నాయకత్వంలో అద్భుతమైన అభివృద్ధిని సాధించిడమే కాకుండా మా భవనంపై ఫోకస్ పెట్టింది. ఈ మధ్య మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ మెంబర్లు, సినీ ఆర్టిస్టుల మీద సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లు, ట్రోలింగ్స్ చేసేవారిపైన కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

సోషల్ మీడియాలో చిన్న పిల్లలు, హీరో హీరోయిన్లపై డార్క్ కామెడీ పేరుతో ట్రోలింగ్ చేస్తూన్న తెలుగు యూట్యూబర్‌లకు మంచు విష్ణు వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. నటినటులను విమర్శిస్తూ చేసిన వీడియోలను, కామెంట్లను 48గంటల్లో తొలగించాలని లేకపోతే వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంచు విష్ణు యూట్యూబ్ వేదికగా హెచ్చరించాడు. అయితే చెప్పినట్లుగానే 48 గంటల అనంతరం సినీ నటులు, వారి కుటుంబ సభ్యుల పట్ల అభ్యంతరకర కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్న యూట్యూబ్ ఛానల్స్‌పై కొరడా ఝుళిపించింది. ఇక విష్ణు చేపట్టిన ఈ చర్యలను టాలీవుడ్‌తో పాటు ఇతర ఇండస్ట్రీలకు చెందిన ఆర్టిస్టులు కూడా ప్రశంసించారు.

సినిమాల విషయానికి వస్తే.. విష్ణు ప్రస్తుతం కన్నప్ప సినిమాలో నటిస్తున్నాడు. కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు స్వీయ నిర్మాణంలో వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప . మంచు విష్ణు కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్నారు. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఈ మూవీని డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించిన నాగ్ అశ్విన్

**నాగర్‌కర్నూల్ :** భారతదేశం పేరును కల్కి సినిమా ద్వారా ప్రపంచవ్యాప్తంగా చాటిన ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ మన నాగర్ కర్నూల్ బిడ్డ కావడం ఎంతో గర్వకారణం అని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. నాగ్ ఆశ్విన్ తన సొంతూరు ఐతోల్(తాడూరు మండలం) లోని ప్రభుత్వ పాఠశాలలో సొంత డబ్బులతో నిర్మించిన అదనపు గదులను జిల్లా కలెక్టర్ సంతోష్, డైరెక్టర్ నాగ్ అశ్విన్‌తో కలిసి ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే అపారమైన మేధాశక్తితో నాగ్ అశ్విన్ ఈరోజు ప్రపంచ స్థాయిలో భారతదేశ చరిత్రను కల్కి సినిమా ద్వారా చాటారని ప్రశంసించారు. చిన్న పల్లెటూరు నుంచి ప్రపంచానికి తన శక్తిని నిరూపించిన నాగ్ అశ్విన్‌ని యువత, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.



సొంత ఊరికి సేవ చేయాలని భావిస్తున్న నాగ్ అశ్విన్, ఆయన కుటుంబీకుల తపన అభినందనీయమన్నారు. ఆర్థికంగా స్థోమత కలిగిన వ్యక్తులు సేవా భావాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు.

తన తండ్రి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి స్వగ్రామం తూడుకుర్తిలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సొంతంగా 10 ఎకరాల భూమిని అందజేశారని, పేదల కోసం కళ్యాణ మండపం నిర్మించారని, తాడూరు ప్రభుత్వ కళాశాలకు మూడు ఎకరాల స్థలాన్ని, మెడికల్ కళాశాల విద్యార్థులకు బస్సును ఇచ్చారని గుర్తు చేశారు. 20 ఏళ్ల పాటు వైద్యునిగా సేవలందించిన తాను నాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చి మీ అందరి ఆశీర్వాదంతో ఎమ్మెల్యేను అయ్యానని అన్నారు. ప్రజలకు జీవితాంతం సేవ చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేట్ కంపెనీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు నిధులు తీసుకొచ్చేలా చూస్తానన్నారు. ఐతోల్ గ్రామాన్ని కచ్చితంగా మండలంగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పాఠశాల పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేస్తామని రాజేశ్ రెడ్డి తెలిపారు.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com